RNI Reg-No. APTEL/2005/15854

నేటి మనదేశం

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 19 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి సోమవారం 23-02-2026 పేజీలు :8 వెల : రూ.1-00

మీరట్ మెట్రో, నమో భారత్ రైలును ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 : ప్రధాని మోడీ ఆదివారం మీరట్ మెట్రో మరియు నమో భారత్ రైలును ప్రారంభించారు. అత్యంత వేగవంతమైన మెట్రోను ఉత్తరప్రదేశ్‌లోని శతాబ్దినగర్ స్టేషన్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. .గంటకు 160 కి.మీ వేగంతో ఈ మెట్రో రైలు ప్రయాణించనుంది. 23కి.మీ దూరాన్ని కేవలం 30 నిమిషాల్లో చేరుకోనుంది. అక్కడి నుండి మెట్రోలో మీరట్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రధాని మోడీ ప్రయాణించారు. 82 కి.మీ ఢిల్లీ, మీరట్ నమో భారత్ కారిడార్‌ను ప్రధాని మోడీ జాతికి అంకితం చేశారు. భారతదేశంలోని మొట్ట మొదటి నమో భారత్ ప్రాంతీయ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టిఎస్)లోని మిగిలిన విభాగాలను ప్రారంభించారు. వీటిలో ఢిల్లీలోని సారారు కాలే ఖాన్ మరియు న్యూ అశోక్ నగర్ మధ్య 5కి.మీ విభాగం, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ సౌత్ మరియు మోడీ పురం మధ్య 21కి.మీ విభాగం ఉన్నాయి. మీరట్‌లో సుమారు రూ.12,930 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారని ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం మీరట్‌లో జరగనున్న బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించనున్నారు.

పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

- పాత వస్తువులు ఇస్తే నిత్యావసర వస్తువులు ఇస్తున్నాం
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా బాధ్యతే
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో చెత్త ఏరివేత చేపట్టాం
- వినుకొండ సభలో సీఎం చంద్రబాబు వెల్లడి

పల్నాడు, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు. స్వచ్ఛ రథం వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారు. పరిసరాల తరువాయి 2లో..

దేశ రాజధానిలో దాడులకు లష్కరే తాయిబా ప్లానింగ్.. ఢిల్లీలో హై అలర్ట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 : దేశ రాజధానిలో దేవాలయాలు, రద్దీ ప్రదేశాల్ని టార్గెట్‌గా చేసుకుని పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబా దాడులకు కుట్ర పన్నిందని నిఘా వర్గాల సమాచారం. దీంతో ఢిల్లీ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా ఢిల్లీలో చారిత్రక ప్రదేశాలైన ఎర్రకోట, చాందినీ చౌక్ పరిసర దేవాలయాల్లో ఐఈడీలతో పేలుడుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమై.. ఆయా ప్రాంతాల్లో భద్రతను పెంచారు. పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. అలాగే అన్ని స్థాయిల్లో భద్రతను 24 గంటలు పర్యవేక్షించేలా పార్లమెంటరీ బృందాలు పనిచేస్తున్నాయి.కాగా, ఇటీవల పాకిస్తాన్ ఇస్లామాబాద్ షియా మసీదు వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. దీనిలో భాగంగా పాక్‌కు చెందిన ఉగ్రసంస్థ తరువాయి 2లో..

కార్లతో ర్యాలీతో నోటీసులు ఉల్లంఘన

అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు

అమరావతి, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి తరువాయి 2లో..

కలెక్టరేట్‌లో నేడు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఇప్పటివరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత నివేదికలతో అధికారులు నిర్ణీత సమయానికి రావాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

కాణిపాకం ఆలయాన్ని 'ప్రసాద్' పరిధిలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తా

రామ్మోహన్‌నాయుడు

కాణిపాకం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : : పర్యాటక, ఆలయాల అభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన 'ప్రసాద్' పథకం పరిధిలో కాణిపాకం ఆలయాన్ని చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారిని మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఆలయ ఛైర్మన్, ఈవో, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ప్రపంచస్థాయి పెట్టుబడు లకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. భగవంతుడి ఆశీస్సులు కూటమి ప్రభుత్వంపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

డిఎంకె కూటమి పార్టీలన్నీ ఐక్యంగా ఉండాలి

కమల్‌హాసన్

మధురై (చెన్నై), ఫిబ్రవరి 22 : తమిళనాడులో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డిఎకెం కూటమి పార్టీలన్నీ ఐక్యంగా ఉండాలని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫీ కమల్‌హాసన్ శనివారం పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డిఎంకె కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకంపై జరుగుతున్న చర్చలలో తాను వ్యక్తిగతంగా పాల్గొనలేదని తాజాగా మీడియాకు చెప్పారు. అయితే ఈ కూటమి తరువాయి 2లో..

జగన్.. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకొని క్షమాపణ కోరండి

మంత్రి మండిపల్లి

వార్త.. 2 లో

మొదటిపేజీ తరువాయి...

పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం

పరిశుభ్రతతోపాటు మీకు ఆదాయం వస్తుందని చంద్రబాబు అన్నారు. సరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. పరిశుభ్రత కోసం మనమంతా కంకణబద్ధులం కావాలన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం-పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చే నాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం అని వివరించారు. ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరువుతున్నా. మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం అన్నారు. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించానని వివరించారు. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం అని అన్నారు. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న దిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని చంద్రబాబు అన్నారు.

దేశ రాజధానిలో దాడులకు లష్కరే తాయిబా ప్లానింగ్..

లష్కరే తొయిబా భారత్‌లో పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు రహస్య సమాచారం అందింది.

కార్లతో ర్యాలీతో నోటీసులు ఉల్లంఘన

అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు

రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీ సులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు.

డిఎంకె కూటమి పార్టీలన్నీ ఐక్యంగా ఉండాలి

పార్టీల మధ్య ఐక్యత ఉండాలని ఆయన విశ్వా సం వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీట్ల సర్దుబాటుకు సంబంధించి.. డిఎంకె ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ శనివారం ఆ కూటమి పార్టీలతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా ఈ కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన కమల్‌హాసన్ పార్టీతోనూ డిఎంకె చర్చలు నడుపుతోంది. ఈ సందర్భంగా కమల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నేను సీట్ల పంపకాలపై జరిగిన చర్చలల్లో నేను పాల్గొనలేదు.

నాకూ బాధ్యత ఉంది. నా తరపున నా పార్టీనేతలు చర్చలు జరుపుతారు. నాకు ఆ నమ్మకం ఉంది. మేము ఎన్ని నియోజకవర్గాలు అడుగుతామో నేను చెప్పలేను. మేము దీన్ని సరైన సమయంలో ఎన్ని సీట్లలో పోటీచేస్తామనే విషయాన్ని ప్రకటిస్తాము' అని ఆయన అన్నారు. కూటమిలో ముఖ్యమైన విషయం ఐక్యత, ఉద్దేశం. అదికు మాకు స్పష్టంగా ఉంది అని కమల్ తెలిపారు.

జగన్.. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకొని క్షమాపణ కోరండి : మంత్రి మండిపల్లి

చిత్తూరు, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : చిత్తూరు పర్యటనలో ఏపీ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేవుడితోనే వైకాపా నీచ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. దేవుడిపై భక్తి, హిందువుల మనోభావాలపై జగన్‌కు గౌరవం లేదని ఆక్షేపించారు. " చెప్పులు వేసుకొని వేంకటేశ్వరస్వామి ఫొటోలతో నిరసన తెలిపారు. తితిదే సంప్రదాయాలు, హిందూ విశ్వాసాలపై జగన్‌కు చిన్న చూపు. పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన ఘనత వైకాపాదే. పరకామణి కేసులో నిందితుడితో జగన్ రాజీపడ్డారు. తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు, సేవా టికెట్లు అమ్ముకున్నారు. శ్రీవారి తలనీలాల అక్రమ రవాణాకు పాల్పడిన ఘనత వైకాపా నేతలది. వైకాపా హయాంలో 300కుపైగా దేవాలయాలపై దాడులు జరిగాయి. శ్రీవారిని అవమానించిన వ్యక్తిని తితిదే ఛైర్మన్‌గా నియమించారు. దర్శనాలు, వసతి, ప్రసాదాల ధర పెంచి భక్తులపై భారం మోపారు. దేవుడితో ఆటలు ఆడినందుకే వైకాపా 11 సీట్లకు పరిమితమైంది. జగన్.. ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకొని దేవుడికి క్షమాపణ కోరాలి"అని మండిపల్లి డిమాండ్ చేశారు.

తిరుమలలో పోటెత్తిన భక్తులు..

సర్వదర్శనానికి 20 గంటల సమయం

తిరుమల, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 10-12 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డేటా ఆధారిత వ్యూహంతో రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జగన్‌కు హిందూమతంపై గౌరవమే లేదు

- పరకామణి నుంచి కల్తీ నెయ్యి దాకా... తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ పాలన
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : దేవుడంటే భక్తి లేదు... హిందువుల మనోభావాలంటే గౌరవం లేదు... అధికారంలో ఉన్నప్పుడు హిందూ ధర్మాన్ని అవమానించి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడినే వాడుకుంటున్నది జగన్ రెడ్డి ముఠా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో దేవదేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి వైసీపీ నేతలు దిగజారారని మండిపడ్డారు.

దేవదేవుడినే రాజకీయాలకు వాడుకున్న నీచ ధోరణి

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఫోటోలను చెప్పులు, షూలు వేసుకుని పట్టుకుని నినాదాలు చేస్తూ శాసనసభల్లోకి వెళ్లడం దేవుడిపై గౌరవం లేకపోవడమేనన్నారు. శ్రీవారి ఆలయంలో నామస్మరణ మాత్రమే వినిపించాల్సిన పవిత్ర ప్రదేశంలో "జగన్ రెడ్డి రక్షక గోవింద" అంటూ నినాదాలు చేయించడం హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. శ్రీవారు నడయాడిన మాడవీధుల్లో చెప్పులతో తిరగడం ద్వారా జగన్ తన నిర్లక్ష్యాన్ని చాటుకున్నాడని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలివేషాల కేంద్రాలుగా మార్చిన వైసీపీ నేతలు, ఇప్పుడు దేవుడి ఫోటోలతో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

కల్తీ ప్రసాదం నుంచి దేవాలయాల దోపిడీ దాకా

శ్రీవారి పరకామణిలో అంతర్జాతీయ కరెన్సీ చోరీ జరిగినప్పటికీ కఠిన చర్యలు తీసుకోకుండా సెటిల్‌మెంట్ రాజకీయాలు నడిపారని పల్లా ఆరోపించారు. దేవుడి డబ్బులు కాజేసిన వారిని వెనకేసుకురావడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పరమపవిత్రమైన శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసిన ఘటన దేశ చరిత్రలో మచ్చగా మిగిలిందన్నారు. తిరుమల తలనీలాలను రూ.2 కోట్లకు కక్కూర్తిపడి మయన్మార్, థాయ్‌లాండ్ మార్గంగా చైనాకు తరలించే ప్రయత్నం బయటపడటం వైసీపీ దొల్లతనానికి నిదర్శనమన్నారు. లడ్డూ కల్తీ అంశం బయటపడిన తర్వాత దాన్ని కప్పిపుచ్చేందుకు కొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. టీటీడీ వీఐపీ, సేవా టికెట్లను వైసీపీ నేతలు అడ్డగోలుగా అమ్ముకున్నారని, దర్శనం నుంచి ప్రసాదాల వరకు అన్నింటిలోనూ బ్లాక్ మార్కెట్ నడిచిందన్నారు. వెంకన్నకిచ్చే తలనీలాలను సైతం అక్రమ రవాణాకు గురిచేసిన దాఖలాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. టీటీడీ నిధులను దారి మళ్లించి ఇతర అవసరాలకు వినియోగించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.

300కి పైగా దేవాలయాలపై దాడులు - ఒక్కసారైనా ఖండించారా?

జగన్ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా దేవాలయాలపై దాడులు జరిగాయని, రామతీర్థంలో రాములవారి శిరస్సు ఖండన వంటి ఘటనలు దేశాన్ని కుదిపేశాయని పల్లా గుర్తుచేశారు. అయినప్పటికీ ఒక్కరోజు కూడా బాధిత ప్రాంతాలను సందర్శించి హిందువులకు ధైర్యం చెప్పలేదని విమర్శించారు. దోషులను శిక్షించకపోవడం హిందూ వ్యతిరేక ధోరణికే నిదర్శనమన్నారు.

సంప్రదాయాల పట్ల చిన్నచూపు : బ్రహ్మోత్సవాల్లో సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని విస్మరించడం, డిక్లరేషన్ అంశాన్ని పట్టించుకోకపోవడం, పండితుల అభ్యంతరాలను నిర్లక్ష్యం చేయడం హిందూ సంప్రదాయాలను కాలరాయడమేనన్నారు. తిరుమల పవిత్రతకు విరుద్ధంగా అన్యమత ప్రచారాలకు తావిచ్చారని, టీటీడీలో నియామకాల విషయంలోనూ వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు.

హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి : జగన్ రెడ్డికి హిందూమతంపై గౌరవం లేదని ఆయన చర్యలే చెబుతున్నాయి. హిందువులను చులకనగా చూసిన ఆయన తన తప్పును ఒప్పుకుని శ్రీవారికి, హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి అని పల్లా డిమాండ్ చేశారు.

వల్లంపూడి పోలీస్ స్టేషన్ నుండి ఏఎస్ఐ శివ కేశవరావుకు ఘన సన్మానం

వేపాడ, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మండలంలోని స్థానిక వల్లంపూడి పోలీస్ స్టేషన్ నుండి ప్రమోషన్‌తో బదిలీపై వెళ్లిన ఏఎస్ఐ శివ కేశవరావును శుక్రవారం రాత్రి పోలీస్ అధికారులు ఘనంగా సన్మానించారు. రూరల్ సీఐ ఎల్. అప్పలనాయుడు, స్టేషన్ ఎస్ఐ సుదర్శన్, జామి ఎస్ఐ జనార్ధన్‌తో పాటు పోలీసులు, సిబ్బంది శివ కేశవరావును శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శివ కేశవరావు మాట్లాడుతూ, "2009లో శృంగవరపుకోటలో కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించానని, 2014లో హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొంది, అనంతరం వేరే మండలంలో కొంతకాలం పనిచేసి తిరిగి వల్లంపూడికి 2019లో బదిలీపై వచ్చి దీర్ఘకాలం తర్వాత 2026లో ఏఎస్ఐగా పదోన్నతి పొంది కొత్తవలస పోలీస్ స్టేషన్‌కు బదిలీ అవుతున్నాను. నా సేవా కాలంలో సహచరులందించిన సహకారానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను" అని అన్నారు. తరువాత మాట్లాడిన ఎస్ఐ సుదర్శన్, "శివ కేశవరావు ప్రశాంత స్వభావం కలిగిన, సేవాభావంతో పనిచేసే వ్యక్తి. స్టేషన్‌కు వచ్చిన ప్రజల సమస్యలను ఓర్పుతో విని, వారికి న్యాయం జరిగేలా కృషి చేశారు. ఆయనలాంటి అధికారిని కోల్పోవడం బాధగా ఉన్నా, కొత్త బాధ్యతల్లో మరింత పెద్ద విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అని తెలిపారు. స్థానిక పోలీసు సిబ్బంది, గ్రామస్థులు కూడా శివ కేశవరావుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన భవిష్యత్ సేవలకు శుభమని ఆకాంక్షించారు.

విశాఖ నగర పరిశుభ్రతకు సహకరిద్దాం

- స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జయప్రదం చేద్దాం.
- స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రథమ స్థానమే ధ్యేయంగా విశాఖ నగరాన్ని నిలుపుదాం.
- జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మాలను జయప్రదం చేస్తూ స్వచ్ఛ సర్వేక్షన్ లో విశాఖ నగరానికి ప్రథమ స్థానమే ధ్యేయంగా విశాఖ నగర పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి. రాము, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కే. శివప్రసాద్ లతో కలిసి లాసెన్స్ బే కాలనీ బీచ్ పార్కులో స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా అందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ఆదనపు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ "జీరో లిట్టర్ గవర్నెన్స్ " నేపథ్యంగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఫిబ్రవరి నెలకు సూచించిందన్నారు. ఇకపై ప్రజలందరూ నాలుగు డస్ట్ బిన్లలో వ్యర్థాలను వేరు చేయాలని, తడి వ్యర్థాలకు గ్రీన్ డస్ట్ బిన్ ,పొడి వ్యర్థాలకు బ్లూ డస్ట్ బిన్ ,సానిటరీ వ్యర్థాలకు రెడ్ డస్ట్ బిన్, ప్రమాదకరమైన వ్యర్థాలకు బ్లాక్ డస్ట్ బిన్లు గా సూచించిందన్నారు ఆ విధంగా ప్రజలందరూ వ్యర్థాలను నాలుగు డస్ట్ బిన్లలో వేరుచేసి జీవీఎంసీ వాహనాలకు నిత్యం అందించాలని, అలాగే ఇల్లు ,పరిసరాలు పరిశుభ్రతతో తీర్చిదిద్దుకోవాలని, లిట్టర్ ఫ్రీ సిటీ, ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జయప్రదం చేస్తూ, వ్యర్థాలను రోడ్లపై, కాలువలలో, బహిరంగ ప్రదేశాలలో పడవేయకుండా నిత్యం జీవీఎంసీ వాహనానికి అందించాలని, స్వచ్ఛ సర్వేక్షన్ 2025 -26 లో విశాఖ నగరాన్ని దేశంలోనే ప్రథమ స్థానములో నిలిపేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అనంతరం బి.రాము మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ విశాఖ నగర పరిశుభ్రతకు, అభివృద్ధికి సహకరించాలన్నారు. వ్యర్థాలను నాలుగు డస్ట్ బిన్లలో వేరుచేసి జీవీఎంసీ వాహనాలకు అందించాలని, ప్రతి ఇంటిలో పరిశుభ్రతను పాటిస్తే పొరుగువారు కూడా అవగాహనతో అవలం బిస్తారన్నారు. విశాఖను స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల ద్వారా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. అనంతరం అందరూ కలిసి నో బిన్ - నో ఫ్యూయల్ పోస్టర్‌ను విడుదల చేసి, దోమల నియంత్రణ పై,ఏర్పాటు చేసిన అవగాహన స్టాళ్లను సందర్శించారు.

నేటి మనదేశమ్ సంపాదకీయం

నయా నియంతృత్వంలో ట్రంప్

ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్ధాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ పక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్ కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్

టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) :

50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో అద్భుతమైన రజత పతకాన్ని (Silver Medal) కైవసం చేసుకున్నాడు.డెకాథ్లాన్ (Decathlon) వారిచే నిర్వహించబడిన ఈ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ నగరంలోని ప్రతిష్టాత్మక ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా జరిగింది. ఈ పోటీల్లో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ పోటీలో నిద్దిష్ అద్భుతమైన నైపుణ్యాన్ని, చురుకుదనాన్ని ప్రదర్శించాడు. తోటి క్రీడాకారుల నుండి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌ను అద్భుతంగా ముగించి పతకాన్ని గెలుచుకున్నాడు.

భర్తవానిపాలెం లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే లలితకుమారి శంకుస్థాపన

వేపాడ , ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) :మండలంలోని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి శని వారం భర్తవానిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. భర్తవానిపాలెం నుండి పోతులవారి కలానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పంటపొలాలకు రక్షణగా రూ.20 లక్షలతో 210 మీటర్ల పొడవున రక్షణ గోడ నిర్మాణం చేపట్టగా, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్‌ను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.తరువాత ఎన్.కె.ఆర్. పురం ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కొత్త నీటి కొళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాంశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యారులంతా శతశాతం ఉత్తీర్ణులు కావాలని, మంచి పౌరులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ జె ఈ మహమ్మద్ అలీ, ఆర్డబ్ల్యూఎస్ దేవి, ఎంఈఓ నాగభూషణ రావు, వేపాడ మండల టిడిపి అధ్యక్షుడు గొంప వెంకటరావు, వేపాడ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి, వేపాడ మండల టీడీపీ వైస్ అధ్యక్షుడు పోతల వెంకటరమణ, జనసేన నాయకులు సుంకరి అప్పారావు, జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మన దేశమ్) : 91,92 వార్డు లు లక్ష్మీ నగర్ 4 కుళాయిలు వద్ద నుంచి కుమారి కళ్యాణ మండపం వరకు జరుగుచున్న BRTC అనుసంధానం రోడ్డు లో జరుగుచున్న పనులను వార్డ్ అధ్యక్షులు గొర్ల అప్పలస్వామి నాయుడు తో కలిపి పర్యవేక్షించిన మాజీ శాసనసభ్యులు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ళ విజయ్ ప్రసాద్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నేను శాసనసభ్యులుగా ఉన్న సమ యంలో చీన -16 నుండి రత్నవారి వంటిల్లు నుంచి బాజీ జంక్షన్ వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 60 అడుగుల రోడ్డు విస్తీకరణ పనులు చేయడం జరిగిందని. అదేవిధంగా ఇప్పుడు కూడా ఎు ఎలక్ట్రికల్ ఫాలో మిడిల్ చేసుకొని రెండు వైపులా సమానంగా మార్కింగ్ ఇచ్చి అందరికీ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. కానీ అధికారం మన చేతిలో ఉందని ఒక్కొక్క దగ్గర ఒక్కొక్క విధంగా మార్కింగ్ ఇచ్చి ప్రజలను ఇబ్బంది పెడితే వారి తరుపున నేనే ధర్నా చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుక్క పైడిరాజు రెడ్డి,ఆల్ల పైడిరాజు,బండారు శ్రీనివాసు, రేఖ ఉషా రాణి,బోర గీత రెడ్డి,,సూరిశెట్టి అనిల్,కాళ్ళ వీరరాజు, రాజశేఖర్,చుక్క శ్రీదేవి,వాసా శ్యామల,నీలపు లోకేష్ రెడ్డి,చింతల గణపతి, చుక్క అప్పలరెడ్డి, స్పందన బాబురావు ,హ్యాండ్,సంతోష్,ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

308 సుగంధి జల కళాశాలతో శోభ యాత్ర

భీమునిపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : భీమిలి బీచ్ రోడ్ చెప్పలుప్పడ సముద్ర తీరంలో నిర్మించిన పరదేశమ్మ నవశక్తి దేవతలు విగ్ర ప్రతిష్ఠ అనంతరం 308 సుగంధ జిల కళాశాలతో మహిళలు శోభ యాత్ర వైభవంగా జరిగింది. శోభ యాత్రను ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గరికిన కింగ్ (ఎల్లయ్య)కాషాయ జెండా ఊపి ప్రారంభించారు. ఎర్రింబ ఆలయం నుంచి పరదేశమ్మ ఆలయం వరకు శోభ యాత్ర నిర్వహించి కళాశాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.

అంత్యక్రియలకు డాక్టర్ కందుల నాగరాజు ఆర్థిక సహాయం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : స్థానిక 32వ వార్డు నేరెళ్ల కోనేరు ప్రాంతంలో మృతి చెందిన పెద్దిలమ్మ కుటుంబానికి విశాఖ దక్షిణ నియోజక వర్గం జనసేన పార్టీ నాయ కులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అండగా నిలిచారు. కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంత్యక్రియకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా వారిని ఆదుకునేందుకు తాను ఎప్పుడూ ముందు ఉంటానని డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి,వారికి అన్ని విధాలుగా తన వంతు సహాయం అందజేస్తానని వెల్లడించారు.వార్డు పరిధి మాత్రమే కాకుండా విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో కూడా తన సేవలను విస్తరించినట్లు ఆయన తెలియజేశారు. తన సహాయం అవసరమైన ప్రతి ఒక్కరికి, ఒక కుటుంబ సభ్యుడి లాగా ముందు ఉండి సహకరిస్తానని పేర్కొన్నారు.

బక్కునాయుడు చెరువు నీరందక రైతుల ఆవేదన

– సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి

వేపాడ మండలం, ఫిబ్రవరి 22 (నేటి మన దేశమ్) : బక్కునాయుడు చెరువు నుండి నీరు అందక పొలాలు ఎండిపోతు న్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సుమారు 50 ఎకరాలకు పైగా నీరు అందడం లేదని రైతులు స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారికు తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా చెరువును పరిశీలించారు. చెరువు వద్ద ఎత్తు పెళ్లాలు పేరుకు పోవ డంతో నీటి ప్రవాహం అడ్డ ంకులు ఏర్పడు తున్నాయని గుర్తించారు. విషయాన్ని వెంటనే ఆర్ అండ్ బి ఇంజ నీరింగ్ అధికారులతో చర్చించి, త్వరిత గతిన సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసకుంటానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. కార్య క్రమంలో వేపాడ టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణ మూర్తి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి సుంకరి అప్పారావు, జనసేన నాయ కులు జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రామదాసు జయంతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మన దేశమ్) : సాగర్ నగర్ శ్రీ మోగదారమ్మ శ్రీమహా లక్ష్మి పద్మాలయం ప్రాంగణంలో ఆలయ వ్యవ స్థాపకులు ఆచార్య సూరపనేని లక్ష్మీప్రసాద్ గారి సహకారంతో మౌనిక పబ్లికేషన్స్ వ్యవస్థాపకులు డి శివకుమార్ సారధ్యంలో శ్రీ రామదాసు జయంతిని ఘనంగా నిర్వ హించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ వాగ్గేయకార వైభవానికి ప్రతీకగా శ్రీరామదాసు నిలిచారని పేర్కొన్నారు . భద్రాచలంలో సీతాసమేతుడైన శ్రీరామ చంద్రమూర్తికి ఆలయాన్ని నిర్మించడానికి తన పరిపూర్ణమైన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. సభానంతరం మన సంస్కృతి సాంప్ర దాయాలకు ప్రాధాన్యతనిస్తున్న గత కొన్ని సంవత్సరాలుగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్న చిన్నారుల తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేసి కృతజ్ఞతలు తెలియజేయడమైనది. సన్నిధిలో గల కళావేదికపై శ్రీరామదాసు కీర్తనలకు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రశంసలు అందుకున్నారు . వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మౌనిక పబ్లికేషన్స్ అధినేత డి శివకుమార్ , వి రవి, ఏ హేమరాను కుమార్, నాట్య గురువులు మౌనిక పట్నాయక్, రాజకుమారి , రాజేశ్వరి , రమ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం

భీమునిపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : జీ వి ఎం సి కమిషనర్ భీమిలి జోనల్ కమిషనర్ వారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతినెల మూడవ శనివారము చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జీరో లీటర్ గవర్నెన్స్ గవర్నమెంట్ అనే నినాదం తో వార్డు 3 , చిన్న బజార్ ప్రాంతంలో, బహిరంగ ప్రదేశం లో, ఖాళీ స్థలాల లో, కాలువలలో చెత్తను వేయకూడదు అని, సమీపం లో ఉన్న చెత్త బుట్టలు వినియోగించాలని, అదే విధం గా స్వచ్ భారత్ మిషన్ కొత్త నిబంధనల ప్రకారం ఇక పై మనం చెత్తను నాలుగు రకాలుగా విభజించాలని తడి, పొడి, ప్రమాదకరం మరియు సానిటరీ వేస్ట్ గా విభజించి ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికునికి ఇచ్చి పరిసరాల పరిశుభ్రతకు సహకరించి స్వచ్ సర్వేక్షణ లో మొదటి ర్యాంక్ కు సహకరించాలని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు..ఈ కార్యక్రమం లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు శివ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఆహారాలతో క్యాన్సర్లను నిరోధించవచ్చు

క్యా...న్స...ర్... ఈ మూడక్షరాల్ని తలుచుకుంటేనే మృత్యువు కళ్లముందు మెదులుతుంది. ఆ భయానికి ప్రధాన కారణం.. చెడు అలవాట్లు, అపోహలు, అనుమానాలు, అవగాహన రాహిత్యం వల్లనేనని నిపుణులు చెప్తున్నారు. శరీరంలోని కణాలు క్రమబద్ధంగా విభజన చెందడంలో అదుపుతప్పడం వల్ల కణాలు క్షీణించకుండా సమూహం ఏర్పడి కణితిలా మారుతాయి. ఇవే క్యాన్సర్ వ్యాధికి దారితీస్తాయి. వీటిలో కొన్ని అపాయకరమైనవి. కాగా, మరికొన్ని నిరపాయకరమైనవి ఉంటాయి. అనువంశికత, జీవనశైలి, ఆహారపుటలవాట్లు, మద్యం సేవించడం, తంబాకు, సిగరెట్ అలవాట్లు క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. క్యాన్సరును ఖచ్చితంగా నివారించే పద్ధతి ఏదీ లేదు. అయితే కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వచ్చే అపాయాన్ని కొంతవరకూ నివారించుకోవచ్చు. క్యన్సర్ అనగానే భయపడిపోవడం కన్నా.. అసలు ఎందుకు వస్తుంది..? వచ్చినప్పుడు ఎలా గుర్తించాలి..? రాకుండా ఎలాంటి జీవనశైలిని అలవర్చుకోవాలి..? ఎలాంటి ఆహారాలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్లకు చెక్ పెట్టొచ్చు..? అనే విషయాలను తెలుసుకోవాలి. మనం తీసుకునే ఆహార పదార్థాలతో క్యాన్సర్లు వస్తాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తుండగా.. పలు రకాల ఆహారాలతో క్యాన్సర్లకు చెక్ పెట్టొచ్చని డాక్టర్లు చెప్తున్నారు. విటమిన్ బీ ఎక్కువగా లభించే ఆహారాలు, ఉదయం అల్పాహారంగా తీసుకొనే తృణధాన్యాలు, గోధుమ ఉత్పత్తుల్లోని ఫోలేట్ అనే రసాయనం కోలన్, రెక్టమ్, బ్రెస్ట్ క్యాన్సర్లు రాకుండా మనల్ని రక్షిస్తాయి. వెల్లుల్లి జాతికి చెందిన ఆహారాలతో పాటు ఒమెగా 3-ఫ్యాటీ ఆసిడ్స్ ఎక్కువగా ఉండే సాల్మన్ చేపలు, వాల్‌నట్, లిన్‌సీడ్ ఆయిల్‌తో మెదడు క్యాన్సర్లను నివారించవచ్చు.

ముదురురంగు పండ్లు, ఆకుకూరలతో పాటు విటమిన్ ఏ ఎక్కువగా ఉండే బొప్పాయి, క్యారట్, మామిడి వంటి తాజాపండ్లతో నోరు, గొంతు క్యాన్సర్లను నివారించవచ్చు. గుడ్లు ఎక్కువగా తీసుకొనే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధిస్తుందని కొన్ని పరిశోధనలు వెల్లడించాయి. విటమిన్-సీ అధికంగా ఉండే నిమ్మ, నారింజ, ద్రాక్ష, జామ ఎక్కువగా తినడం వల్ల చర్మక్యాన్సర్ తగ్గే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

కాల్షియం సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలు కాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని గుర్తించారు. ప్రోటీన్లను అధికంగా కలిగి ఉన్న సోయా, ఫ్లేవర్డ్ సోయా పాలు, స్నాక్స్ వంటి వివిధ రకాలలో మార్కెట్లో ఇప్పుడు అందుబాటులో దొరుకుతున్నాయి. అధికంగా కాల్షియం లభించే పెరుగు, పాలు, అరటిపండ్లు, వంటి వాటిని ఆహారంలో తప్పక భాగం చేసుకోవాలి. పాలీఫీనాల్స్ ఎక్కువగా ఉండే గ్రీన్-టీ, దానిమ్మ కూడా ప్రోస్టేట్ క్యాన్సర్ కణాల వ్యాప్తిని సమర్థంగా అదుపు చేస్తాయి. బ్రకోలీ, కాలీఫ్లవర్‌తో ప్రోస్టేట్ క్యాన్సర్‌ను నివారించవచ్చుని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. బెర్రీలు, చెర్రీలు, టొమాటో, బ్రాకోలీతోపాటు ప్రోటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారం, చేపలు, గుడ్లతోనూ ఎముక క్యాన్సర్ నివారించుకోవచ్చు. బీన్స్, అవిసె, సోయా, ద్రాక్షపండ్లు తీసుకోవడం వల్ల కూడా క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు. విషయాలు తెలుసుకోవాలి..

క్యన్సర్ వ్యాధికి గురైన వారు తాము ఎదుర్కొంటున్న రకం క్యాన్సర్ గురించిన విషయాలు తెలుసుకోవాలి. చికిత్స సమయంలో, చికిత్స తర్వాత సైడ్ ఎఫెక్ట్స్ ఎలా ఉంటాయో అర్థం చేసుకొని మసలుకొనేలా ప్రిపేరవ్వాలి. మీరు ఎదుర్కొంటున్న క్యాన్సర్ గురించి కుటుంబసభ్యులతోగానీ, స్నేహితులతోగానీ, కౌన్సిలర్‌తోగానీ చర్చిస్తూ ఉండాలి. అధునాతన చికిత్సల గురించి తెలుసుకొంటూ వాటిని పొందేందుకు వీలు చేసుకోవాలి. ఆందోళనను తగ్గించుకోవడానికి యోగా, మెడిటేషన్, హిప్నాటిజం, తైచీ, అరోమాథెరపీ వంటివి చేయాలి. వీలు చిక్కినప్పుడు అధీకృత నిర్వాహకులచే మసాజ్ చేయించుకోవాలి. చికిత్స నిర్వహణకు ఖర్చు తడిసిమోపెడవుతున్నందున వ్యయంపై దృష్టిసారించాలి. కంటి నిండా నిద్రపోయేలా బెడ్రూంను సిద్ధం చేసుకోవాలి. నిద్రాభంగం కలుగకుండా చూసుకోవాలి. నిత్యం పరిశుభ్రంగా స్నానమాచరిస్తూ శుభ్రమైన వస్త్రాలు ధరించాలి. అదేవిధంగా శరీరంపై అవాంఛిత రోమాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. ఎప్పుడూ పది మందితో కలిసి ఉండేలా కలివిడిగా ఉండటం ద్వారా సంతోషంగా మెలగవచ్చు.

ముందస్తు జాగ్రత్తలు

మన శరీరం బరువు అతిగా ఉండటం వల్ల కొన్నిరకాల క్యాన్సర్లు మన అవయవాలపై దాడిచేసే ప్రమాదమున్నది. అందుకని మితంగా ఆహారం తీసుకోంటూ సిగరెట్, మద్యం మానుకోవడం చాలా అవసరం. రెడ్ మీట్‌ను మొత్తానికి దూరంగా పెట్టాలి. బయటి వాతావరణంలో తిగిరే వారికి ఆల్ట్రా వయోలెట్ రేస్ కారణంగా చర్మ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నందున సన్‌స్క్రీన్ లోషన్స్ వాడుకోవాలి. సాధ్యమైనంత ఎక్కువగా కూరగాయలు తీసుకోవాలి. అయితే విటమిన్ సప్లిమెంట్స్ తీసుకొంటున్నాం మాకేం మందులు, ఆహారాలు అవసరం లేదని అనుకోవద్దు. సప్లిమెంట్స్ కూరగాయలు, పండ్లకు సరిరావని గుర్తించాలి. వీలైనంత వరకు చక్కెర తినకుండా జాగ్రత్తపడాలి. కూల్‌డ్రింక్స్, ఆర్టిఫీషియల్ డ్రింక్స్, మిఠాయిలు, ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం మానేయాలి. వీలైతే బెల్లం వాడుకోవాలి. అందుబాటులో ఉన్న వైద్యుడి వద్దకు వెళ్లి హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. నిత్యం కనీసం అర్థగంటసేపైనా వ్యాయామం చేయడం ద్వారా హార్మోన్స్ విడుదలై కొన్ని రకాల క్యాన్సర్లు రాకుండా కాపాడుతాయి. అలాగే బరువు కూడా తగ్గించుకోవచ్చు.



పుచ్చపండు లాంటి ఆరోగ్యం!

ఎండకాలం వస్తోందనగానే అందరి చూపు పుచ్చపండ్ల మీదికి మళ్లుతుంది. ఎర్రటి గుజ్జుతో కూడి, చూడగానే నోరూరించే వీటిల్లో నీటిశాతం చాలా ఎక్కువ. సుమారు 95% వరకూ నీరే ఉంటుంది. పుచ్చపం డులో బీటా కెరొటిన్, విటమిన్ సి వంటి పోషకాలు దండిగా ఉం టాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లు గానూ పనిచేస్తాయి. అంటే రోగని రోధకశక్తి పెంపొందటానికి తోడ్పడతా యన్నమాట. పుచ్చపండు మాత్రమే కాదు.. తీయ దోస (హనీడ్యూ), ఖర్బూజా (క్యాంటలోప్) సైతం దీని కోవకు చెందినవే. ఖర్బూజాను ఒక ముక్క (80 గ్రాములు) తిన్నా ఆ రోజుకు అవసరమైన విటమిన్ సి, విటమిన్ ఎ మోతాదులో సగం వరకు లభిస్తాయి. వీటిల్లోని పోషకాలు మన ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో చూద్దామా.

కంటి చూపు మెరుగు: పుచ్చపండు గుజ్జు ఎర్రటి రంగులో ఉండటానికి కారణం బీటా కెరొటిన్. ఇది చర్మం, ఎముకలు ఆరోగ్యంగా ఉండటానికి చాలా ముఖ్యం. వయసు పెరుగుతున్నకొద్దీ కంట్లోని రెటీనా మధ్యభాగం క్షీణించటం మూలంగా చూపు తగ్గిపోయే సమస్యనూ ఇది నివారిస్తుంది. ఖర్బూజాలోని ల్యూటీన్, జియాగ్జాంతీన్ సైతం కంటి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

రక్త ప్రసరణ ఉత్తేజం: పుచ్చపండు గుజ్జు, తొక్కలో సిట్రులిన్ అనే అమైనో ఆమ్లం దండిగా ఉంటుంది. ఇది నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తయ్యేలా ప్రేరేపిస్తుంది. ఫలితంగా రక్తనాళాలు విప్పారతాయి. అవయవాలకు రక్త ప్రసరణ మెరుగవుతుంది.

రక్తపోటు అదుపు: పొటాషియం మూత్రం ఎక్కువ వచ్చేలా చేస్తుంది. దీంతో రక్తపోటు తగ్గుముఖం పడుతుంది. అందువల్ల పొటాషియం తగినంతగా లభించాలంటే పుచ్చపండు తింటే సరి. ఇలా రక్తపోటు

అదుపులో ఉండేలా చేసుకోవచ్చు. మరోవైపు దీనిలోని లైకోపేన్ గుండెజబ్బు ముప్పు తగ్గటానికీ తోడ్పడుతుంది.

పుండ్లు మాన్పుతుంది: ఆర్జినైన్ అనే అమైనో ఆమ్లం ఉత్పత్తి కావటంలో పుచ్చపండులోని సిట్రులిన్ పాలు పంచుకుంటుంది.

ఈ లక్షణాలు మీకుంటే మీరు మేధావే..!

మేధావి అనే మాట వినగానే ముఖం అలా వెలిగిపోతుంది. ఓ మేధావి గురించి మాట్లాడినా, చెప్పినా, లేదా అతడిని చూసినా ఓ రకమైన సంతోషం కలుగుతుంది. ఇంతకీ మేధావి అంటే ఎవరు? అసలు అతడికి ఎలాంటి లక్షణాలు ఉంటాయి? మేధావి గురించే మాట్లాడుకునే వారిలో మేధావి లక్షణాలు లేవా.. మేధావి కావాలంటే ఎలాంటి లక్షణాలు ఉండాలి అనే అంశంపై బ్రిటన్‌కు చెందిన ఓ అధ్యయనం కొన్ని వివరాలు వెల్లడించింది. ముఖ్యంగా ఈ ఐదు లక్షణాలు ఉంటే మాత్రం మేధావేనట. ఆ లక్షణాలేమిటో ఒకసారి పరిశీలిస్తే..

1. ప్రతి విషయం గురించి అమితమైన ఆసక్తి

ఒకే అంశానికి పరిమితం కాకుండా నిరంతరం భిన్న విషయాలను పఠించి వాటిని నేర్చుకోవడం మేధావి లక్షణం. జీనియస్‌లంతా ఇలాగే చేస్తారట.

2.మీలో మీరు మాట్లాడుకోవడం

సాధారణంగా కొంతమంది వ్యక్తులు తమలో తాము మాట్లాడుకుంటుంటారు. అప్పుడప్పుడు ఆ మాటలు బయటకు కూడా వినిపిస్తాయి. వారిని చూసి కొంతమంది నవ్వుకుంటారు కూడా. అయితే, అలా మాట్లాడుకునేవారు అస్సలు సిగ్గుపడొద్దట. ఎందుకంటే మేధావులు అలాగే చేస్తారని అధ్యయనం చెబుతోంది.

3.పుస్తకాల పురుగు

సాధారణంగా ఎవరైతే నిత్యం పుస్తకాల్లో మునిగి ఉంటారో వారంతా జీనియస్ అంట. వారు పిచ్చిపట్టిన వారిలా పుస్తకాలు చదువుతూ కనిపిస్తారట.

4.కష్టాలతో ఎంజాయ్

మేధావులు కష్టాలను సవాలుగా తీసుకుని, వాటిని సొంత తెలివితేటలతో పరిష్కరించుకొని ఆనందంగా గడిపేస్తారంట.

5.తప్పులు క్షమించి మర్చిపోగలిగే తీరు

సాధారణంగా మేధావులు తప్పు చేసిన వారిని క్షమిస్తారట. అసలు ఆ విషయాలను అంతపెద్దగా పట్టించుకోరంట.

మద్యంతో మరింత చలి!

చలి నుంచి కాపాడుకోవటానికి కొందరు మద్యం తాగటం చూస్తుంటాం. దీంతో లాభం కన్నా నష్టమే ఎక్కువ. మద్యం తాగిన తర్వాత ఒళ్లు కాస్త వెచ్చబడినట్టు అనిపించటం నిజమే. అయితే ఇదేమీ ఎక్కువసేపు ఉండేది కాదు. తాత్కాలిక ప్రభావమే. మద్యం రక్తనాళాలు విప్పారేలా చేస్తుంది. ముఖ్యంగా చర్మం కింది సూక్ష్మ రక్తనాళాలు విప్పారతాయి. దీంతో చర్మానికి రక్త సరఫరా పెరిగి, వేడి భావన కలుగుతుంది. ఇది చలి నుంచి కాపాడుకోవటానికి శరీరం చేసే ప్రయత్నానికి విరుద్ధం. సాధారణంగా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఒంట్లోంచి వేడి బయటకు వెళ్లకుండా మన శరీరం రక్తనాళాలు

సంకోచించేలా చేసుకుంటుంది. మద్యం తాగితే ఈ రక్షణ ప్రక్రియ దెబ్బతింటుంది. చర్మానికి రక్త సరఫరా పెరుగుతుంది. బయటి చలి ప్రభావానికి ఇది త్వరగా చల్లారుతుంది కూడా. మరోవైపు రక్త ప్రసరణ మూలంగా పుట్టిన వేడిని చల్లార్చుకోవటానికి చెమట్లు పడుతుంటాయి. ఫలితంగా ఒంట్లోని అవయవాల ఉష్ణోగ్రత (కోర్ టెంపరేచర్) తగ్గుతుంది. కొన్నిసార్లు మనకు తెలియకుండానే చాలా వేగంగా శరీర ఉష్ణోగ్రత పడిపోతుంది. శరీర ఉష్ణోగ్రత అతిగా పడిపోతే తలతిప్పు, సరిగా మాట్లాడలేకపోవటం, ఏకాగ్రత కొరవడటం వంటి దుష్ప్రభావాలెన్నో ముంచుకొస్తాయి. ఇక అతిగా మద్యం తాగటం వల్ల అధిక బరువు, గుండెజబ్బులు, కాలేయ జబ్బులు, క్యాన్సర్ల వంటి సమస్యల ముప్పులూ పెరుగుతాయి. కాబట్టి చలి నుంచి కాపాడుకోవటానికి మద్యం తాగటం కన్నా వీలైనంతవరకు ఇంట్లోనే ఉండటం, ఉన్ని దుస్తులు ధరించటం, తలకు చెవులకు మఫ్లర్ కట్టుకోవటం, విటమిన్ సితో కూడిన పుల్లటి పండ్లు తినటం, చర్మానికి తరచూ మాయిశ్చరైజర్లు రాసుకోవటం మంచిది.

గుండె ఆరోగ్యానికి చిన్న మార్పులైనా చాలు!



గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవటం, గుండెజబ్బుల బారినపడకుండా చూసుకోవటం ఎంత ముఖ్యమో కొవిడ్-19 మహమ్మారి మరోసారి గుర్తుచేసింది. గుండెజబ్బులతో బాధపడేవారికి కరోనాజబ్బు తీవ్ర చిక్కులు తెచ్చిపెట్టటం చూస్తున్నదే. కరోనాతో మరణించినవారిలో గుండెజబ్బులు గలవారి సంఖ్యా ఎక్కువగా ఉండటం తెలిసిందే. మనకు కొవిడ్-19 కారక సార్స్-కోవీ-2 కొత్తదే కావొచ్చు. ఇది విసిరిన సవాళ్లు కొత్తవి కావొచ్చు. కానీ గుండెజబ్బుల మీద దశాబ్దాలుగా అధ్యయనాలు సాగుతూనే ఉన్నాయి. జీవనశైలి పరమైన అలవాట్లు గుండె మీద ఎంతగానో ప్రభావం చూపుతాయన్నది ఇవన్నీ స్పష్టంగానే పేర్కొంటున్నాయి. పొగ మానెయ్యటం, ఆరోగ్యకరమైన ఆహారం తినటం, చురుకుగా ఉండటం, బరువు తగ్గటం, రక్తపోటు అదుపులో ఉంచుకోవటం, కొలెస్ట్రాల్ పెరగకుండా చూసుకోవటం, రక్తంలో గ్లూకోజును తగ్గించుకోవటం.. ఈ ఏడు సూత్రాలు గుండెకు ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చాలాకాలంగా చెబుతూనే ఉన్నారు. ఇవి ఒక్క గుండె ఆరోగ్యానికే కాదు, కొవిడ్-19, ఫ్లూ వంటి ఇన్‌ఫెక్షన్ల ముప్పులు తగ్గటానికీ దోహదం చేస్తాయి.

మరీ ఏడు సూత్రాలంటే ఎలా? అన్నీ పాటించటం ఎక్కడ కుదురుతుంది? అనుకునేవారు కొన్ని ఆచరించినా చాలు. ఆ మాటకొస్తే అందరికీ బరువు తగ్గాల్సిన, గ్లూకోజు అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు. చాలామందికి పొగ తాగే అలవాటూ లేకపోవచ్చు. నిజానికి ఇక్కడ సూత్రాల సంఖ్య ప్రధానం కాదు. ఎంతవరకు ఆచరిస్తున్నామన్నదే ముఖ్యం. మనలో చాలామంది కూరగాయలు, పొట్టుతీయని ధాన్యాలు, చిక్కుళ్లు, పండ్ల వంటివి అంతగా తిననే తినరు. వ్యాయామాలూ సరిగా చేయరు. వారానికి కనీసం 150 నిమిషాల సేపు వేగంగా నడవటం వంటి ఒక మాదిరి తీవ్రమైన వ్యాయామం చేయాలన్నది నిపుణుల సిఫారసు. అలాగే వారానికి కనీసం 2 సార్లు బరువులు ఎత్తటం వంటి కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలూ చేయాలి. ఈ ఆహార, వ్యాయామ నియమాలు రెండింటిని పాటిస్తేనే బరువూ అదుపులో ఉంటుందనుకోండి. దీంతో రక్తపోటు, కొలెస్ట్రాల్, గ్లూకోజు సైతం నియంత్రణలో ఉంటాయి. అందువల్ల కొన్ని చిన్న మార్పులతో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం మీద దృష్టి పెట్టినా పెద్ద ఫలితమే కనిపిస్తుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు.

ఆహారంలో మార్పు: కొవ్వు పదార్థాలు తగ్గించుకోవటం ముఖ్యం. మాంసాహారులైతే అప్పుడప్పుడు మాంసానికి బదులు చిక్కుళ్లు తినొచ్చు. వీటితో కొవ్వులేకుండానే మంచి ప్రొటీన్ లభిస్తుంది. వేపుళ్లు కాస్త తగ్గించినా మేలే. వనస్పతికి దూరంగా ఉంటే ఇంకా మంచిది. అలాగే బాగా పాలిష్ పట్టిన బియ్యం కన్నా ఒక పట్టు బియ్యం, దంపుడు బియ్యం రుచి చూడొచ్చు. ఇంతకుముందు ఎరగని కొత్త కూరగాయలనూ ఒకసారి లాగించొచ్చు. ఇవేవీ కష్టమైన పనులేమీ కాదు.

గుండె వేగాన్ని పెంచే వ్యాయామాలు: వీటిని 10 నిమిషాలు చేసినా సరే. ఇందుకోసం ఇంటి చుట్టుపక్కల్లోనే కాస్త వేగంగా నడవొచ్చు. వీలుంటే ట్రెడ్‌మిల్ మీద నడవచ్చు. ఎలాంటి వ్యాయామ పరికరాలు లేవని బాధపడాల్సిన పనిలేదు. ఉన్నచోటే ఎగరటం, గుంజీలు తీసినట్టు పిరుదులను మోకాళ్ల ఎత్తు వరకు వచ్చేలా నడుమును కిందికి తేవటం, కాళ్లు లేపటం, చేతులు తిప్పటం వంటివి చేసినా చాలు.

ఆరోగ్య సంఖ్యలపై అవగాహన: గుండె ఆరోగ్యం తీరుతెన్నులను శరీరమే పట్టిస్తుంది. వీటిని గుర్తించే నేర్పే కావాలి. ఇందుకోసం కొన్ని సంఖ్యల గురించి తెలుసుకొని ఉండటం మంచిది. ఒకసారి శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి (బీఎంఐ) ఎంతుందో చూసుకోండి. ఇది 18.5 నుంచి 25 మధ్యలో ఉండాలి. పెరిగితే జాగ్రత్త పడాల్సిందే. రక్తపోటు 120/80 కన్నా తక్కువ ఉండాలి. రక్తంలో మొత్తం కొలెస్ట్రాల్ సంఖ్య 200 ఎంజీ/డీఎల్ కన్నా మించకూడదు. ఇక పరగడుపున రక్తంలో గ్లూకోజు 100 ఎంజీ/డీఎల్ కన్నా తక్కువగా ఉండాలి. అయితే ఇవి అందరిలో ఒకేలా ఉండాలనేమీ లేదు. వయసు, ఇతరత్రా జబ్బులు, వంశపారంపర్యంగా వచ్చే స్వభావాల వంటివన్నీ వీటిపై ప్రభావం చూపొచ్చు. ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి ఆయా సంఖ్యలు ఎంత మోతాదులో ఉండాలో తెలుసుకొని, నడచుకోవాలి.

పచ్చబొట్లతో జాగ్రత్త!

పచ్చబొట్టు మనకు కొత్త కాదు. ఒకప్పుడు ముచ్చట కొద్దీ పొడిపించుకునేవారు. ఇప్పుడిదో సౌందర్య సాధనంగానూ మారిపోయింది. ఒకనాటి ఆలివ్ గ్రీన్‌లోనే కాదు, రకరకాల రంగుల్లోనూ పచ్చబొట్లు దర్శనమిస్తున్నాయి. వీటితో అందం ఇనుమడించటం మాట అటుంచితే కొన్ని ముప్పులు లేకపోలేదు. జాగ్రత్తలు తీసుకోకపోతే జబ్బుల బారినపడే ప్రమాదముంది.

కళాకారులు చేత్తో పట్టుకునే పరికరంతో చర్మం లోపలి పొరల్లోకి రంగు ద్రవ్యాలను జొప్పిస్తారు. మత్తుమందు ఇవ్వకపోవటం వల్ల కొంత నొప్పి పుడుతుంది. కొన్నిసార్లు రక్తస్రావం కావొచ్చు. సూదులను సరిగా శుభ్రం చేయకపోతే ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. హెపటైటిస్ బి, సి వంటి తీవ్ర ఇన్‌ఫెక్షన్లూ సోకొచ్చు.

కొన్ని వర్ణద్రవ్యాల్లో లోహాలుంటాయి. ముమ్ముందు ఎప్పుడైనా ఎంఆర్ఐ తీస్తే వీటి మూలంగా మంటతో కూడిన నొప్పి రావొచ్చు. వాపు తలెత్తొచ్చు. ఎంఆర్ఐ ఫలితాలూ తప్పుగా రావొచ్చు.

రంగులతో.. ముఖ్యంగా ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, నీలి రంగులతో కొందరికి అలర్జీ మొదలవ్వచ్చు. ఇది దురదకు దారితీస్తుంది. కొన్నిసార్లు ఏళ్ల తర్వాత కూడా దురద రావొచ్చు.

చెమట గ్రంథులు ఉండే పొరల్లో రంగులను జొప్పించటం వల్ల చెమట గ్రంథుల పనితీరు అస్తవ్యస్తం కావొచ్చు. చెమట ఉత్పత్తి 50% వరకు తగ్గిపోవచ్చు. పెద్ద పెద్ద పచ్చబొట్లు పొడిపించుకున్నవారిలో ఇలాంటిది ఎక్కువ. వేడి, తేమతో కూడిన చోట్ల పనిచేసేవారికి, క్రీడాకారులకు ఇది చిక్కులు తెచ్చిపెట్టొచ్చు.

ఇన్‌ఫెక్షన్ మూలంగా చర్మకణాలు దెబ్బతిని, కణజాలం గట్టి పడొచ్చు. కొందరికి చిన్న చిన్న గడ్డల్లాంటివి ఏర్పడొచ్చు. దీంతో చర్మం సాగే గుణం తగ్గిపోతుంది. కదలికలు కష్టమవుతాయి. ఇలాంటి సమస్యలకు దీర్ఘకాలం చికిత్స అవసరమవుతుంది.

ఇవి చూసుకోవాలి..

- పచ్చబొట్టు వేసేవారు విధిగా చేతులకు గ్లవుజులు ధరించేలా, స్టెరిలైజ్ చేసిన పరికరాలనే వాడేలా చూసుకోవాలి.
- టేబుళ్లు, చర్మాన్ని స్టెరిలైజింగ్ ద్రావణాలతో శుభ్రం చేసిన తర్వాతే పచ్చబొట్టు పొడిపించుకోవాలి.
- పచ్చబొట్టు వేయించుకున్నాక చర్మాన్ని పొడిగా ఉంచుకోవాలి. దుమ్ముధూళి, ఎండ పడనీయొద్దు. చర్మానికి అంటుకుపోయే దుస్తులు వేసుకోవద్దు. బొట్టు వేసిన భాగం నయం కావటానికి రెండు వారాలు పట్టొచ్చు.

మిరప ఎగుమతికి నాణ్యతే కీలకం

మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యమైన మిర్చికి విపరీతమైన డిమాండ్ ఉందని, రైతులు దీనిపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరులో జరిగిన మిర్చి యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులు అవ గాహన పెంచుకోవాలని సూచిం చారు. 2019-24 మధ్య ధ్వంసమైన యార్డును పునఃనిర్మాణం చేయాల్సిన బాధ్యత నూతన కమిటీపై ఉందన్నారు. గుంటూరు యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు మాట్లాడుతూ దేశం లోనే యార్డు ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

బోధనలో మానవ సహానుభూతి అమూల్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మన దేశమ్) : యువ మేధస్సులోని శాస్త్రీయ ఊహా శక్తిని, పరిపక్వమైన ఉపాధ్యాయులు వాటిని శ్రద్ధ దృక్పథంతో గుర్తించి, ప్రోత్సాహిస్తే అది ఎన్నో ఉద్యోగ అవకాశాలను సృష్టించ గలదని ఇండి యన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అధ్యా పకుడు, పోస్టల్ సర్వీస్ బోర్డు మాజీ సభ్యుడు, ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ ఉదరు బాలకృష్ణన్ అన్నారు. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, ద్వారకా గ్రంథా లయం ఆధ్వ ర్యంలో 'యువతను బోధించడం సవాలు, ఆనందం' అనే అంశంపై సదస్సు నిర్వ హిం చారు. ఈ సంద ర్భంగా బాల కృష్ణన్ మాట్లా డుతూ విద్యార్థి లోని ప్రతిభా కిరణాలను కేవలం ఆసక్తి, సహానుభూతితో కూడిన ఉపాధ్యాయుడే గుర్తించగలడని, కృత్రిమ మేధస్సు కాదన్నారు.. కత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతున్న నేటి యుగంలోనూ, మానవ సహానుభూతి దృష్టి బోధనలో అమూల్య మైనదన్నారు. కార్య క్రమంలో ప్రొఫెసర్ ప్రసన్న కుమార్, గ్రంథా లయం కార్యదర్శి డిఎస్. వర్మ, డాక్టర్ వెంకటేశ్వర్లు, కెసి రెడ్డి, డాక్టర్ మధుకుమార్, ప్రొఫెసర్ నిరూప రాణి, దుర్గారాణి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

160 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ

మాచర్ల, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మాచర్ల పురపాలక సంఘ పరిధిలో 'సాసా' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఈ-వేస్ట్ కలె క్షన్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, మున్సిపల్ అడ్మి నిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ మార్గదర్శకాల మేరకు స్థానిక పురపాలక సంఘ కార్యాలయం నుంచి పార్క్ సెంటర్ వరకు డ్రైవ్ చేపట్టి ఈ-వ్యర్థాలను సేకరించారు. పట్టణ ప్రజలు, వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల ప్రతినిధులు తమ వద్ద ఉన్న పనికిరాని 36 ఎల్‌సీడీ టీవీలను ఈ-వేస్ట్ సేకరణ వాహనానికి అంద జేశారు. డ్రైవ్ ద్వారా మొత్తం 160 కిలోల ఈ-వేస్ట్ సేకరించినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ప్రతినెలా 10వ తేదీ, 20వ తేదీల్లో ఈ-వేస్ట్ సేకరణ డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌లో కూడా ప్రజలు తమ వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అప్పగించవచ్చని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలందరూ సహకరించి, ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.

గంజాయి విక్రయించినా, రవాణ చేపట్టినా, వినియోగించినా జైలుకే

గంజాయి రవాణకు పాల్పడినా, వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విజయనగరం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : గంజాయి విక్రయాలు చేపట్టినా, అక్రమ రవాణకు పాల్పడినా, వినియోగించినా తీవ్రమైన నేరంగా పరిగణించి, చట్ట పరిధిలో కఠిన చర్యలు చేపడు తున్నామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఒకవైపు కఠినమైన చర్యలు చేపడుతూ, మరోవైపు విద్యార్థులు, యువత, ప్రజలను మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను వివరించేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నింది తులను విచారించి, సమాచారం సేకరించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంజాయి అక్రమ రవాణకు ప్రధాన సూత్ర దారులను గుర్తించి, అరెస్టు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణకు పాల్పడినా, సేవించినా, విక్రయించినా పోలీసుశాఖ తీవ్రంగా పరిగణిస్తుందని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణను నియంత్రిం చేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, ఆక స్మిక తనిఖీలు చేపట్టడంతో పాటు, చెక్ పోస్టులను బలో పేతం చేసామని జిల్లా ఎస్పీ తెలి పారు. గంజాయి వినియోగం వలన యువత ప్రక్కదారి పడుతున్నారని, మాదక ద్రవ్యాల మత్తులో నేరస్థులుగా మారు తున్నారన్నారు. వారి భవిష్యత్తును చక్కదిద్దేందుకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అన ర్థాలను విద్యార్థులకు వివరిస్తూ, వారిని చైతన్య పరుస్తూ, వాటికి దూరం చేసేందుకు తమవంతు ప్రయత్నంగా కళాశాలలు, గ్రామాలను సంద ర్శించి, విద్యార్థులకు మరియు ప్రజలకు అవ గాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా తమవంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. గంజాయి వ్యాపారుల ప్రలోభాలకు, వారు ఇచ్చే నగదుకు ఆశపడి యువత అక్రమ రవాణ ఉచ్చులోపడి, పోలీసులకు చిక్కి, భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. వ్యాపారుల ప్రలోభాలకు లొంగొద్దని, భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని యువతకు జిల్లా ఎస్పీగారు పిలుపునిచ్చారు. జిల్లాలో గంజాయి హాట్ స్పాటులను గుర్తించి, ప్రత్యేకంగా హాట్ స్పాట్ ప్రదేశాలలో నిరంతరం నిఘా పెట్టామని జిల్లా ఎస్పీ తెలిపారు.

రాష్ట్రంలో పెరిగిన ఎండ.. కర్నూలులో 36.3 డిగ్రీలు

- నేడు, రేపు పిడుగులతో కూడిన వర్షాలు

అమరావతి, విశాఖపట్నం ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరిగింది. కర్నూలులో 36.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమో దైంది. కాగా, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం శుక్రవారం బలహీన పడింది. అయితే దీనిపై ఆవరించిన ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయవ్యంగా పయనించి శ్రీలంక వైపు రానున్నది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

శ్రీశైలం ఆలయంలో కల్తీ నెయ్యిపై సమగ్ర విచారణ చేయాలి

ఆలయ చైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో జరిగిన కల్తీ నెయ్యి వ్యవ హారంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు డిమాండ్ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో మే 2023 నుంచి మార్చి 2024 వరకు కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని తెలిపారు. అంతకుముందు విజయా డెయిరీ సరఫరా చేస్తున్న నెయ్యిని కాదని.. డెయిరీ సంస్థలే కాకుండా ట్రేడర్స్ కూడా పాల్గొనవచ్చు అని నిబంధనలు మార్చి టెండర్లు నిర్వహించారని వివరించారు. దీంతో ఆనాడు ఎలాంటి అనుభవం లేకపోయినా రాజేశ్ కార్పొరేషన్‌కు టెండర్లు అప్పజెప్పారని, వారి హయాంలోనే ఈ కల్తీ నెయ్యి సరఫరా జరిగిందన్నారు. దీని వెనుక గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్‌లోని ఒక మంత్రి, అప్పటి ఓ శాసనసభ్యుడితో పాటు ఓ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి హస్తం ఉందన్నారు. వారి సహకారంతో 2,92,845 కేజీల నెయ్యిని ఆనాడు కొని రూ.16 కోట్లు వారికి చెల్లించారన్నారు. అప్పటి ప్రభుత్వంలో కల్తీనెయ్యి వ్యవహారంలో కీలకపాత్ర పోషిం చిన ఆ ఉన్నతాధికారి నేటి ప్రభుత్వంలో కూడా ఓ కీలకశాఖలో పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించి, ఇందుకు బాధ్యులైనవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు.

జాతీయ కవితల విజేత కుప్పిలి వెంకట రాజారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : విశాఖపట్నం సహృదయ సాహితి సమితి జాతీయస్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో స్థానిక రచయిత కుప్పిలి వెంకట రాజారావు విజేతగా నిలిచారు. విశాఖపట్నం పౌర గ్రంథా లయంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ వేదికపై కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఎండుటాకు అనే కవిత పంపిన వెంకట రాజారావును అభినందిస్తూ న్యాయనిర్ణేతల బృంద సభ్యులతో పాటు సహృదయ సాహితి అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్, కార్యదర్శి చిన సూర్య నారాయణ తదిత రులు శాలువా, జ్ఞాపిక, విజేత ప్రశంసా పత్రం, నగదు పారితో షికాలతో ఘనంగా సన్మానించారు.

నేడు ఎచ్చెర్లలో మెగా జాబ్ మేళా

శ్రీకాకుళం (నేటి మనదేశమ్): నిరుద్యోగ యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగపరచుకోవాలని జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపు ణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం, ఎచ్చెర్ల లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఫిబ్రవరి 23న (సోమవారం) ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, మిరాకిల్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, టెక్ మహీంద్రా, వోల్టాస్ లిమిటెడ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఎన్.ఎస్. ఇన్స్ట్రుమెంట్స్, డైకిన్ తో కలుపుకుని సుమారు 13 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయి.

బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- నెల్లూరులో ఇద్దరు అరెస్టు.. మరో ఇద్దరు పరార్
- రూ.34 లక్షలు, ల్యాప్‌టాప్, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం
- బ్యాంక్ ఖాతాలోని మరో రూ.1.64 కోట్లు సీజ్

నెల్లూరు, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు ఎస్పీ అజిత వేజెండ్ల ఆ వివరాలను విలేకరు లకు వెల్లడించారు. నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఓ వ్యాపారిని ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ఫోన్ నెంబరును బుచ్చిరెడ్డిపాలెం రామకృష్ణానగర్‌కు చెందిన కె.వేణుగోపాల్ ఇచ్చాడు. దీంతో వ్యాపారి పలు దఫాలుగా ఆ నెంబర్‌కు రూ.53 లక్షల నగదు డిపాజిట్ చేశారు. ఆదాయం రాకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సాంబ శివరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందం గురువారం రాత్రి బుచ్చి రెడ్డిపాలెంలో వేణుగోపాల్‌కు చెందిన ఓ గదిలో తనిఖీ చేసింది. వేణు గోపాల్‌తో పాటు అక్కడే ఉన్న బి.వెంకట రమణను అదుపులోకి తీసుకుని విచారించగా క్రికెట్ బెట్టింగ్ విషయం వెలుగులోకి వచ్చిం ది. వేణు గోపాల్ అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరితో కలిసి ఆర్ 777 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రాధే ఎక్స్ఛేంజ్ యాప్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వ హి స్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వేణుగోపాల్, వెంకట రమణలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.34,65,800 నగదు, ల్యాప్‌టాప్, టీవీ, 13 మొబైల్ ఫోన్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలోని రూ.1,64,74,600ను సీజ్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు.

ఉగాదికి అన్ని దేవాలయాల్లో అక్షరాభ్యాసం

హెచ్‌డీపీటీ చైర్మన్ దాసరి శ్రీనివాసులు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 22 (నేటి మన దేశమ్) : హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉగాదికి అన్ని దేవాలయాల్లో పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ట్రస్టుచైర్మన్ దాసరి శ్రీనివాసులు తెలిపారు. కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల హెచ్‌డీపీటీ కోఆర్డినేటర్లు, దేవదాయ శాఖ కార్యనిర్వ హణాధికారులు, అర్చకుల సమాఖ్యతో సమావేశం నిర్వహించారు. శ్రీని వాసులు మాట్లాడుతూ గోదా వరి, కృష్ణా పుష్కరాలను పురస్క రించుకొని ఇప్పటి నుంచే ఆయా నదుల వెంట దేవతా వృక్షాలు నాటిం చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరిం చారు. మార్చి 7న కంచి పీఠాధిపతి, సీఎం చంద్ర బాబు సమ క్షంలో ప్రకాశం బ్యారేజీ నుంచి హంసల దీవి వరకు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభి స్తామన్నారు. దుర్గగుడి ఈవో శీనానాయక్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగపూడి గోపాలకృష్ణ తదితరులు ప్రసం గించారు.

27 నుంచి ఇస్రో 'యువికా' రిజిస్ట్రేషన్లు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 22 (నేటి మన దేశమ్) : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహిస్తున్న యువ విజ్ఞాన కార్యక్రమం 'యువికా-2026' రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. మార్చి 31 వరకు అవకాశం ఉంటుందని, 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని ఇస్రో ఓ ప్రకటనలో వెల్లడించింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించేందుకు ఇస్రో ఏటా 'యువికా' కార్య క్రమం నిర్వ హిస్తోంది. ఇందులో భాగంగా స్పేస్ టెక్నాలజీ, సైన్స్ అప్లికేషన్‌లపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించ నున్నారు. మేలో రెండు వారాల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణా తరగతులు నిర్వహి స్తారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో పాటు డెహ్రా డూన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, తిరువనంత పురం లోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, బెంగ ళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్రన్ స్పేస్ అప్లికేషన్ సెంటర్లలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విమానాశ్రయానికి ప్రతిపాదిత భూములపై సమీక్ష

మాచర్ల, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మండల పరిధిలో విమానాశ్రయ నిర్మా ణానికి ప్రతతిపాదించిన భూముల అంశంపై తహ శీల్దారు కార్యాలయంలో సమీక్షిం చారు. ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన బృంద సభ్యులు అనిందితా రారు (సోషల్ టీమ్), ఆయుషి రారు (జీటీ టీమ్ ఉ అసిస్టెంట్ మేనేజర్), ప్రోజిత్ ముఖర్జీ (జీటీ టీమ్ ఉ కన్సల్టెంట్), పరమిత రారు (సోషల్ టీమ్), సుమర్ సర్కార్ (సామాజిక నిపుణుడు) తదితరులతో తహశీల్దార్ కిరణ్‌కుమార్, వీఆర్వోలు సమావేశమయ్యారు. మాచర్ల మండలం లోని పశువేముల, చింతల తండా, నాగులవరం, విజయ పురి సౌత్ తదితర గ్రామాల్లో విమా నాశ్రయానికి ప్రతి పాదించిన సుమారు 800 యకరముల భూమి గురించి చర్చించారు. ప్రతి పాదిత భూముల వర్గీకరణ, ప్రైవేటు భూములు, అసైన్‌మెంట్ భూములు, రహదారులు, ఎన్ఎస్‌పీ కాలువలకు సంబంధించిన భూముల రేట్లు తదితర అంశా లపై సమగ్రంగా చర్చిం చారు. సంబంధిత రెవెన్యూ రికార్డులు, ఎఫ్.ఎం.బీలు పరిశీలించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు కిరణ్ కుమార్ తెలిపారు. సమా వేశంలో మండల సర్వేయర్ సిహెచ్.శ్రీనివాస రావు, పశువేముల విఆర్ఒ కేతావత్ చిరంజీవి నాయక్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కమల్ హీరో... రజినీ విలన్?

సూపర్ స్టార్ రజినీకాంత్, లోక నాయకుడు కమల్ హాసన్‌ల కలయికలో 46 ఏళ్ల తర్వాత సినిమా రాబోతుండడం వాళ్లిద్దరి అభిమానులనే కాక దక్షిణాది సినీ ప్రేక్షకులందరినీ ఎంతో ఉత్సాహానికి, ఉద్వేగానికి గురి చేస్తోంది. కోలమావు కోకిల, డాక్టర్, బీస్ట్, జైలర్ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నెల్సన్ దిలీప్ కుమార్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోతున్నాడు. రజినీ, కమల్ మంచి మిత్రులైనప్పటికీ.. వారి మధ్య దశాబ్దాలుగా వృత్తిపరమైన పోటీ ఉంది. అభిమానుల మధ్య ఫ్యాన్ వార్స్ సంగతీ చెప్పాల్సిన పని లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఈ ప్రోమోలో ఇద్దరూ నువ్వెంత అంటే నువ్వెంత అన్నట్లు వ్యవహరించారు. అసలీ సినిమాలో హీరో ఎవరో చెప్పాలంటూ ఇద్దరు దర్శకుడు నెల్సన్‌ను ఇరుకున పెట్టేలా ప్రశ్నలు కూడా సంధించారు. కానీ ఆ ప్రశ్నకు ప్రోమోలో జవాబు మాత్రం ఇవ్వలేదు. ఐతే ఈ చిత్రంలో రజినీకాంత్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేస్తుండొచ్చు అనే చర్చ జరుగుతోంది. రజినీ, కమల్ ఇద్దరూ నెగెటివ్ రోల్స్ చేయడంలో ఎవరికి వాళ్లే సాటి. కెరీర్ ఆరంభంలో రజినీ విలన్ పాత్రలు చాలానే చేశాడు. 'రోబో' సినిమాలో నెగెటివ్ షేడ్స్‌ను అద్భుతంగా పండించాడు. ఇక కమల్ 'అభయ్' సినిమాలో హీరోగా, విలన్‌గా నటించాడు. 'కల్కి' చిత్రంలోనూ విలన్ పాత్ర చేసిన సంగతి తెలిసిందే. ఐతే కమల్‌ను మించి రజినీనే నెగెటివ్ క్యారెక్టర్‌ను బాగా చేయగలడన్నది స్పష్టం. అందుకే ఆయన పాత్రను కొంచెం నెగెటివ్ షేడ్స్‌తో తీర్చిదిద్ది ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రోమోలో ముందుగా కమల్‌ను చూపించి, పేరు కూడా తనదే ముందు వేయడం కూడా ఈ అనుమానాలను బలపరుస్తోంది. ఐతే బాల నటుడిగా ఐదేళ్ల వయసు నుంచే సినిమాలు చేయడం ద్వారా నటనలో రజినీ కంటే కమలే సీనియర్ కాబట్టి ఆయన పేరు ముందు వేసి ఉండొచ్చు, ఆయన్నే ముందు చూపించి ఉండొచ్చని.. అంతమాత్రాన ఆయనే హీరో అని.. రజినీ విలన్ అని ఒక అభిప్రాయానికి రావడం కూడా కరెక్ట్ కాదనే వాదన కూడా వినిపిస్తోంది. ఐతే ప్రోమో ద్వారా మూవీలో ఒక్కరే హీరోనా.. లేక ఇద్దరూ హీరోలుగానే కనిపించనున్నారా అనే చర్చను లేవనెత్తి ఈ సినిమాకు ఆరంభంలోనే కావాల్సినంత బజ్ తీసుకొచ్చాడు నెల్సన్.



ఎన్నిసార్లు చెప్పాలి.. సీనియర్ నటి అసహనం

90వ దశకంలో దక్షిణాది సినీ ప్రేక్షకులను ఒక ఊపు ఊపిన కథానాయిక.. మీనా. ఇటు తెలుగులో, అటు తమిళంలో ఆమె అప్పటి టాప్ స్టార్లందరితోనూ సినిమాలు చేశారు. స్టార్ హీరోయిన్‌గా వెలుగొందారు. కెరీర్లో బిజీగా ఉండగానే ఆమె విద్యాసాగర్ అనే వ్యాపారవేత్తను పెళ్లి చేసుకుని వ్యక్తిగత జీవితంలో స్థిరపడ్డారు. వీరికి ఓ అమ్మాయి పుట్టింది. తన పేరు.. నైనిక. తమిళ బ్లాక్‌బస్టర్ మూవీ 'తెరి'లో ఆ పాప కీలక పాత్ర పోషించింది. ఐతే నాలుగేళ్ల కిందట మీనా కుటుంబంలో పెను విషాదం చోటు చేసుకుంది. అనారోగ్యంతో ఆమె భర్త చనిపోయారు. ఐతే భర్త చనిపోయిన కొన్ని రోజులకే తాను రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు వార్తలు రావడం పట్ల మీనా అప్పట్లో చాలా బాధ పడింది. కానీ ఈ రూమర్లు ఎంతకీ ఆగట్లేదు. భర్త చనిపోయిన నాలుగేళ్ల తర్వాత కూడా మీనా సింగిల్‌గానే కొనసాగుతుండగా.. ఆమె రెండో పెళ్లి గురించి మాత్రం వార్తలు ఆగట్లేదు. ఈ విషయంలో మీనా తాజాగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన రెండో పెళ్లి గురించి పదే పదే ఎందుకు పుకార్లు పుట్టిస్తున్నారంటూ ఆమె ప్రశ్నించారు. తాను లైమ్ లైట్లో ఉన్న మహిళను కావడంతో ఇలా అదే పనిగా వార్తలు పుట్టిస్తూ ఉంటారా అన్నారు. ఈ వార్తలు తనను ఎంతో బాధిస్తున్నాయని, తన పట్ల అన్యాయంగా వ్యవహరిస్తున్నారని మీనా పేర్కొన్నారు. తనకు ఒక కూతురు ఉన్న విషయం మరిచిపోతున్నారని.. తను ఆన్ లైన్లో ఈ వార్తలు చూస్తుందని.. తనతో పాటు తన కుటుంబం మీద మానసికంగా ఈ వార్తలు ప్రతికూల ప్రభావం చూపుతాయని మీనా అన్నారు. తాము ఏదైనా ప్రచారం చేసి పబ్బం గడుపుకోవచ్చని కొందరు అనుకుంటారని.. కానీ ఇలాంటి వారిని కర్మ విడిచిపెట్టదంటూ మీనా తన అసహనాన్ని, ఆవేదనను బయటపెట్టారు. మీనా ఇన్నిసార్లు చెబుతున్నా తన రెండో పెళ్లి గురించి వార్తలు పుట్టిస్తున్న వాళ్లు ఆమె ఆవేదనను అర్థం చేసుకుని ఇకనైనా నెమ్మదిస్తారేమో చూడాలి. మీనా కీలక పాత్ర పోషించిన క్రేజీ సీక్వెల్ దృశ్యం-3 ఏప్రిల్ 2న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.

తెలుగు సినిమాలపై తాప్సి మళ్లీ...

ముందు సౌత్ సినిమాల్లో నటించి, ఆ తర్వాత బాలీవుడ్‌లో స్థిరపడ్డ హీరోయిన్లు చాలామంది.. ఇక్కడి సినిమాలు, పరిస్థితుల గురించి విమర్శలు చేయడం చాలాసార్లు చూశాం. వాళ్లు నిజంగానే ఇక్కడ ఇబ్బంది పడి ఉండొచ్చు. కానీ ఏదైనా నచ్చనపుడు నో చెప్పే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా.. కెరీర్ అవసరాల దృష్ట్యా అప్పటికి అన్నింటికీ ఓకే చెప్పి తర్వాత విమర్శలు చేయడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. తెలుగులో చాలా వరకు గ్లామర్ పాత్రలే చేసి, బాలీవుడ్‌లోకి వెళ్లాక నటనకు ప్రాధాన్యమున్న పాత్రల్లో నటించి పేరు సంపాదించిన ఇలియానా, తాప్సి లాంటి వాళ్లు.. తమను సౌత్ ఇండస్ట్రీ గ్లామర్ కోణంలోనే చూడడం మీద పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐతే గ్లామర్ రోల్స్ చేయడం ఇష్టం లేనపుడు వాటికి నో చెప్పి ఉండొచ్చనే ప్రశ్నలు తలెత్తుతాయి. వాటికి సమాధానం ఉండదు. ఇప్పుడీ చర్చంతా ఎందుకంటే.. తాప్సి తాజాగా మరోమారు తెలుగు సినిమాలు, సౌత్ ఇండస్ట్రీ మీద నెగెటివ్ కామెంట్స్ చేసింది. తెలుగు చిత్రాల్లో తనకు ఎదురైన చేదు అనుభవం గురించి మాట్లాడింది. ఒక సినిమా చిత్రీకరణ సందర్భంగా తనను ప్యాడిల్ బ్రా ధరించమని ఒత్తిడి తెచ్చినట్లు వెల్లడించింది. దర్శకుడు దీని గురించి అసిస్టెంట్‌కు చెప్పడం, అతను కాస్ట్యూమ్స్ విభాగానికి చెప్పడం, వాళ్లు తనకు చెప్పడం.. ఇలా తనకు విషయం చేరిందని.. ఐతే తాను ప్యాడిల్ బ్రా ధరించాక అందరికీ తేడా స్పష్టంగా తెలిసిపోయిందని.. సెట్లో ఈ వ్యవహారం చాలా ఇబ్బందికరంగా మారిందని తాప్సి వ్యాఖ్యానించింది. ఇక సౌత్ సినిమాల్లో నడుం, బొడ్డు ఫాంటసీ గురించి కూడా తాప్సి కామెంట్లు చేసింది. సౌత్ ఫిలిం మేకర్స్‌కు, ప్రేక్షకులకు దాని మీద అంత మోజు ఎందుకో తనకు తెలియదని వ్యాఖ్యానించింది. కెమెరా ఫోకస్ ఎక్కువగా అక్కడే ఉంటుందని పేర్కొంది. అదే సమయంలో బాలీవుడ్‌కు హీరోయిన్ల క్లీవేజ్ మీద దృష్టి ఎక్కువ అని ఆమె కామెంట్ చేసింది. తాప్సి కీలక పాత్ర పోషించిన 'అస్సీ' సినిమా ఈ శుక్రవారం రిలీజై పాజిటివ్ రివ్యూలు తెచ్చుకుంది.

బిజినెస్ న్యూస్

రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతికత వినియోగంపై చర్చ

దిల్లీ: రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతికత వినియోగంపై భారత సైన్యంలోని ఉన్నతాధికార్లు, విధాన రూపకర్తలు, సాంకేతికత భాగస్వాములు, సంస్థల ప్రతినిధులు చర్చించనున్నారు. వచ్చే వారం దిల్లీలో జరగనున్న డిఫ్‌శాట్ నాలుగో ఎడిషన్ సదస్సు ఇందుకు వేదిక కానుంది. జాతీయ భద్రతలో అంతరిక్ష రంగ పాత్రపై ఫిబ్రవరి 24-26 వరకు మానేక్‌షా సెంటర్ వద్ద ఈ సదస్సు జరగనుంది. 'అంతర్జాతీయంగా 50కి పైగా దేశాలు మిలిటరీ లేదా డ్యుయల్ యూజ్ శాటిలైట్‌లను ఉపయోగిస్తున్నాయి. శత్రు దాడులను నిరోధించడం, ఎదుర్కొనే సన్నద్ధత విషయంలో అంతరిక్ష సాంకేతికత కూడా కీలకంగా మారింద'ని శాట్‌కామ్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ) ఇండియా ప్రెసిడెంట్ సుబ్బారావు పావులూరి తెలిపారు. డిఫ్‌శాట్-2026 సదస్సులో సుమారు 20 దేశాల నుంచి 500 మంది పాల్గొననున్నారు. 20 మందికి పైగా వక్తలు, సుమారు 60 సంస్థల ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. కాగా.. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల సమర్పించిన బడ్జెట్లో రక్షణ రంగానికి గణనీయంగా రూ.7.85 లక్షల కోట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సదస్సు జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ రక్షణ విషయంలో ముందస్తు సన్నద్ధత కోసం భారత్ భారీగా వెచ్చిస్తోందనడానికి ఈ కేటాయింపులే సంకేతమని ఎస్ఐఏ ఇండియా డైరెక్టర్ జనరల్ అనిల్ ప్రకాశ్ తెలిపారు

ఏఐ కొలువుల్లో మెట్రో నగరాల జోరు

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) ఉద్యోగాల్లో మెట్రో నగరాలు దూసుకెళ్తున్నాయి. నౌకరీ.కామ్ పోర్టల్‌పై దాదాపు 70 శాతం ఏఐకు సంబంధించిన ఉద్యోగాలు.. బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయిల్లోనే ఉంటున్నాయని స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ సీబీఆర్ఈ తాజా నివేదికలో వెల్లడించింది. 2025 డిసెంబరు నాటికి నౌకరీ పోర్టల్‌పై ఉన్న 64,500 క్రియాశీల ఏఐ ఉద్యోగ ప్రకటనలను విశ్లేషించి, ఈ నివేదికను వెలువరించింది. మొత్తం ఏఐ అనుబంధ ఉద్యోగాల్లో బెంగళూరు 25.4 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో దిల్లీ-ఎన్‌సీఆర్ (24.8%), ముంబయి (19.2%) ఉన్నాయి. నౌకరీ పోర్టల్‌లో ఏఐ కింద నమోదైన ఉద్యోగ లిస్టింగ్‌ల డేటాను మాత్రమే తీసుకున్నామని, దేశంలో మొత్తం ఏఐ ఉద్యోగాల మార్కెట్‌ను ఇది ప్రతిబింబించదని సీబీఆర్ఈ స్పష్టం చేసింది. ఏఐ ఉద్యోగాల మార్కెట్‌లో హైదరాబాద్ (12.5%), పుణె (9.6%), చెన్నై (6.4%), కోల్‌కతా (2.1%) వాటాలను కలిగి ఉన్నాయి. ప్రస్తుతం ఏఐ విభాగంలో ప్రధానంగా ఇంజినీరింగ్ (సాఫ్ట్‌వేర్, క్వాలిటీ అస్యూరెన్స్), డేటా సైన్స్- అనలిటిక్స్, కస్టమర్ సేవలు, కార్యకలాపాల రంగాల్లో నియామకాలు జోరుగా సాగుతున్నాయి. పెద్ద సంఖ్యలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)లకు కేంద్రంగా ఉండటంతో ఏఐ ఉద్యోగాల్లో బెంగళూరు ఆధిపత్యం చెలాయిస్తోంది. 'ఏఐ అనేది ఇప్పుడు కేవలం ఒక చర్చాంశం కాదు. భారత ఆర్థిక వృద్ధిలో కీలక భాగం. అంతర్జాతీయ సంస్థలు మన దేశాన్ని కేవలం సేవా కేంద్రంగానే కాకుండా, సరికొత్త ఆవిష్కరణల హబ్‌గా చూస్తున్నాయి' అని సీబీఆర్ఈ ఇండియా ఛైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ పేర్కొన్నారు. కొత్తగా డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్న తాజా ఉత్తీర్ణులు (ఫ్రెషర్స్)కు శుభవార్త. 2026 ప్రథమార్థం (జనవరి-జూన్)లో ఫ్రెషర్లను నియమించుకోవడానికి దాదాపు 73 శాతం కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని 'టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ కెరీర్ ఔట్‌లుక్' నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జనవరి-జూన్‌లో నాలుగింట మూడు (73%) కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలకు మొగ్గుచూపాయి. అంతక్రితం ఆరు నెలలతో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. దేశంలో పలు నగరాలు, పరిశ్రమలకు చెందిన దాదాపు 1051 కంపెనీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను వెలువరించారు.

నైపుణ్యాలకే పట్టం: ప్రస్తుతం కంపెనీలు కేవలం అకాడమిక్ సర్టిఫికేట్లను మాత్రమే చూడటం లేదని, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టు అనుభవం ఉన్న అభ్యర్థులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది. కేవలం డిగ్రీ ఉన్న వారి కంటే, పని నేర్చుకుని నిరూపించుకున్న వారికే త్వరగా కొలువులు లభిస్తున్నాయి అని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ సీఈఓ శంతను రూజ్ తెలిపారు.

రంగాల వారీగా చూస్తే.. రిటెయిల్ (91%), ఇ-కామర్స్, టెక్నాలజీ అంకుర సంస్థలు (90%), తయారీ (85%), పర్యాటకం, ఆతిథ్యం (77%) గిరాకీ లభిస్తోంది. రిటెయిల్‌లో డార్క్ స్టోర్ అసిస్టెంట్, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ఉద్యోగాలకు మంచి గిరాకీ ఉంది. ఇ-కామర్స్, టెక్నాలజీ అంకుర సంస్థల్లో డిజిటల్ సేల్స్ అసోసియేట్, జూనియర్ వెబ్ డెవలపర్ స్థానాలకు ఆదరణ దక్కుతోంది. తయారీలో బ్యాటరీ అసెంబ్లీ టెక్నీషియన్, ఇన్వెంటరీ, లాజిస్టిక్స్ కో-ఆర్డినేటర్ స్థానాలకు ఎక్కువ గిరాకీ ఉంది. 84 శాతం ఫ్రెషర్ల నియామకాలతో దేశంలోనే అగ్రస్థానంలో బెంగళూరు నిలిచింది. ఇక్కడ ఐటీ, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డిజిటల్ మార్కెటింగ్ విభాగాల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ముంబయి (72%) రెండో స్థానంలో ఉంది. రిటెయిల్, ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఇక్కడ అత్యధిక ఉద్యోగాలు లభిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌లకు ప్రాధాన్యం: డిగ్రీతో పాటు అప్రెంటిస్‌షిప్ చేసే సంస్కృతి పెరుగుతోందని, ముఖ్యంగా బెంగళూరులో 45 శాతం కంపెనీలు 'డిగ్రీ అప్రెంటిస్‌షిప్' అభ్యర్థుల పట్ల ఆసక్తి చూపుతున్నాయని నివేదిక పేర్కొంది. విద్యుత్, ఇంధన రంగాల్లో గతంతో పోలిస్తే గిరాకీ 50 శాతం మేర పెరగడం విశేషం.

సబ్బు, షాంపూ ధరలు ప్రియం

రోజువారీ వినియోగించే సబ్బులు, టూత్‌పేస్ట్-బ్రష్‌లు, షాంపూల వంటి ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలను కంపెనీలు 5% వరకు పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయని సమాచారం. గతేడాది సెప్టెంబరులో వీటిపై జీఎస్‌టీ రేటును 12% నుంచి 5 శాతానికి తగ్గించడంతో, కంపెనీలు ఆమేర ధరలు తగ్గించాయి. ఇప్పటివరకు ఈ ఉత్పత్తుల ధరలు స్థిరంగా ఉంటూ వచ్చాయి. 'జీఎస్‌టీ రేట్ల కోత ప్రభావం ముగింపు దశకి వచ్చినట్లు ఉందని, తయారీదార్లు కొన్ని ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలను 5% వరకు పెంచే పనిలో ఉన్నారని' ఆంగ్లపత్రికలు తెలిపాయి. కమొడిటీల ధరలు పెరగడం, రూపాయి క్షీణత కారణంగా, కంపెనీల మార్జిన్లపై ప్రభావం పడుతుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. పెంచిన గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ)లు ముద్రించిన ప్యాక్‌ల వస్తువులు తమకు సరఫరా అయినట్లు డిస్ట్రిబ్యూటర్‌లు చెబుతున్నారు. డిటర్జెంట్లు, తలనూనె, చాక్‌లెట్‌లు, నూడిల్స్, అల్పాహారంగా తీసుకునే పలు ఉత్పత్తుల ధరలు

పెంచుతున్నట్లు సమాచారం. ప్రస్తుత త్రైమాసికంలో 2% ధరలు పెంచుతామని డాబర్ ఇండియా ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహిత్ మల్హోత్రా పేర్కొన్నారు కూడా. 2026-27లోనూ ధరల పెంపు కొనసాగొచ్చని ఆయన తెలిపారు. గృహ సంరక్షణ ఉత్పత్తుల ధరల పెంపు త్వరలోనే ఉంటుందని.. ఇప్పటికే పెంచిన ధరలతో ఉత్పత్తులను మార్కెట్లోకి పంపించామని హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ముఖ్య ఆర్థిక అధికారి నిరంజన గుప్తా తెలిపారు. సర్ఫ్ ఎక్సెల్, రిన్, విమ్, డోమెక్స్ లాంటి గృహ సంరక్షణ విభాగ ఉత్పత్తుల ధరలను హెచ్‌యూఎల్ పెంచుతోంది. డిసెంబరు త్రైమాసికంలోనే టీ ధరలను కొంత మేర పెంచినట్లు టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్ తెలిపింది.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

పట్టించుకోని సంబంధిత అధికారులు

అనంతగిరి, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) :గ్రామాలో సమాచార వ్యవస్థను మెరుగు పరిచేందుకు బీఎస్ ఎన్ఎల్ సెల్ టవర్లను ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అయితే, ఇవి సరిగా పని చేయక వినియోగదారులు తరచూ ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సెల్-సిగ్నల్స్ సమస్య తలెత్తుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కొండిబ గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ గత వారం రోజులుగా మూగపోయింది. సెల్ఫోన్ సంకేతాలు లేక వినియోగదారులు చాలా ఇక్కట్లు పడుతున్నారు.వీటిని తిరిగి సంబంధిత అధికారులు పునరుద్ధరించిన రోజుల వ్యవధిలోనే అవి మామూలపు తున్నాయి. కొండిబ గ్రామంలో ఏర్పాటు చేసిన బి ఎస్ ఎన్ ఎల్ టవర్లు సాంకేతికపరమైన సమస్యతో సిగ్నల్స్ రాక వినియోగదారులు. తీవ్ర ఇబ్బందులు ర్కొంటున్నారు. ప్రతి నెలా రీచార్జి డేటా వేసుకుంటున్నా!!!!సిగ్నల్ పనిచేయక డబ్బు వృధా అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. వారం రోజులు నుంచి సెల్ టవర్ పనిచేయకున్నా సిబ్బంది ఎటు వంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి అంబు లెన్సుకు ఫోన్ చేయాలన్నా, దూరప్రాంతాల్లో ఉన్న తమ బంధువులతో మాట్లాడాలన్నా వీలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సంబంధిత అధికా రులు ఇకనైనా స్పందించి బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

నాన్ షెడ్యూల్ ప్రాంతంలో భూ ఆక్రమణలు

- పట్టించుకునే నాథుడే కరువాయే..

- అధికారులు అండదండలతో యధేచ్ఛగా ప్రభుత్వ భూములు కబ్జాలు

- ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న పట్టించు కోని అధికారులు, అటవీశాఖ భూమిని కబ్జా చేస్తున్న దలారీలు
- గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీల్లో ఆగని భూ అక్రమణలు
- గుమ్మకోట తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేయాలని డిమాండ్

అనంతగిరి (అల్లూరి జిల్లా), ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మండలంలో గుమ్మకోట పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు మజ్జి భీమారాజు మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ ప్రాంతం గుమ్మ కోట, గరుగుబిల్లి పంచాయతీలలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయి గుమ్మకోట పంచాయతీలో గొట్టేల పాడు రెవిన్యూలో పూర్వం ఇల్లులు కట్టుకొని ఉండే గ్రామకంఠం ఈరోజు కబ్జాకు గురైనట్టు స్థానిక గ్రామ ప్రజలు తెలిపారు.గ్రామ కంఠంలో భూ యజమాని ఎల్.ఎస్.నాయుడు రేకులు షెడ్ వేయడం జరిగింది.రెవిన్యూ అధికారులు అక్రమణ జరిగిన గ్రామ కంఠం భూమి ని ప్రజలకు అప్పగించాలి.గరుగుబిల్లి పంచాయతీ సింగవరం రెవిన్యూ సింగవరం గ్రామంలో 22 సర్వే నెంబర్ లో గతంలో ఆర్మీ రిటైర్ ఉద్యోగస్తులకు పట్టాలిచ్చారని తెలిసిన మాట వాస్తవమే కానీ గిరిజన సంఘం నాయకులు గంగరాజు అప్పట్లో పట్టాలు చేయించారు.అప్పటి ఆర్డీవో క్యాన్సిల్ చేయడం జరి గింది. కానీ ప్రస్తుతం 22 సర్వే నెంబర్ గల భూములను అదే వ్యక్తులు భూములు లెవెలింగ్ చేయిస్తున్నారు. అప్పటి ఆర్డీవో పట్టాలు క్యాన్సిల్ చేసారు. సాగు చేసుకుంటున్న రైతులు పట్టాలడిగితే ఇది అటవీ శాఖ అధికారులు వచ్చి ఈభూమి మాది అని పెట్టాలి చావకుండా అడ్డు పడేవారు ఇప్పుడు అటవీ శాఖ భూమిని ఎలా పట్టా లిచ్చారు రైతులకు పట్టా లివ్వకుండా భూస్వాములకు పట్టాలు ఇచ్చి సొమ్ము చేసుకునే విధంగా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. వెంటనే అధి కారులు స్పందించి భూ కబ్జాలు జరిగిన ప్రతి చోట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తూ, ప్రభుత్వ ఆధీనంలోకి భూములు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు నష్టం జరిగితే తెలుగుదేశం పార్టీ ఊరుకునేదే లేదు.మండల రెవిన్యూ అధికారులు స్పందించలేని ఎడల జిల్లా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు తెలియచేయడం జరుగుతుంది.తెలుగుదేశం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా కొంతమంది అధికారులు చర్యలు ఉంటున్నాయని, దీనిపై తహసీల్దార్, వారు, అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి ఈ కార్యక్రమంలో గుమ్మకోట తెలుగుదేశం పార్టీ నాయకులు,కొండమ్మ,బిడ్డ మహేష్,కె.స్వామి, చిన్నారావు, సోములు,పంచాలి రాము,బి సన్యాసి దేముడు, కె.సన్యాసి పాల్గొన్నారు,

నాణ్యమైన సేవలు అందించకుంటే చర్యలు తప్పవు

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

ఆకస్మిక తనిఖీల్లో జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హెచ్చరిక

కొమరాడ, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : వినియోగదారులకు సరైన తూకాలు మరియు నాణ్యమైన సేవలు అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. కొమరాడ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా గ్యాస్ ఏజెన్సీలు మరియు పెట్రోల్ బంకులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని నిత్యావసర వస్తువుల సరఫరాలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా సహించేది లేదన్నారు . నిరంతరం నిఘా ఉంచాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. మొదటగా కొమరాడలోని లోకేష్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని జె.సి సందర్శించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, సిలిండర్ల నిల్వలను తనిఖీ చేశారు. వినియోగదారులకు పంపిణీ చేసే ప్రతి సిలిండర్‌ను తప్పనిసరిగా తూకం వేసి డెలివరీ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేసినా, తూకంలో తేడాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రాజలక్ష్మి ఫిలింగ్ స్టేషన్‌తో పాటు మరికొన్ని పెట్రోల్ బంకులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జె.సి స్వయంగా పెట్రోల్, డీజిల్ నాణ్యతను మరియు తూకాలను పరీక్షించారు. ఇంధనంలో కల్తీ జరగకుండా ఎప్పటికప్పుడు డెన్సిటీ పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. బంకుల్లో వినియోగదారులకు అవసరమైన తాగునీరు, గాలి మరియు మరుగుదొడ్ల సౌకర్యం ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పౌరసరఫరాల శాఖ, తూనికలు మరియు కొలతల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి

ఒంటిమిట్ట (నేటి మనదేశమ్) : ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో మార్చి 27 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 1న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణం ఏర్పాట్లను వేగవంతం చేయాలని తితిదే జేఈవో వి.వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులను పరిశీలించి, అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు అన్నప్రదాలకు వీలుగా టేబులు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

వావిలపాడు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు

ఎస్పై సుదర్శన్ ప్రారంభం

వేపాడ, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మండలంలోని వావిలపాడు గ్రామంలో భద్రతా పరిరక్షణను మరింత బలోపేతం చేయడానికి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో రౌడీ బాయ్స్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వల్లంపూడి పోలీస్ స్టేషన్ ఎస్పై సుదర్శన్ ప్రారంభించారు. కెమెరాల ప్రారంభోత్సవ సందర్భంగా గ్రామంలోని పలువురు ప్రముఖులు హాజరై హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం యువత ముందుకు రావడం అభినందనీయమని ఎస్పై సుదర్శన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామ భద్రత కోసం ఇలాంటి చర్యలు ప్రతి గ్రామంలో విస్తరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలో నేరాల నియంత్రణ, రహదారి పర్యవేక్షణ, రాత్రి భద్రత వంటి అంశాలు మరింత మెరుగు పడ నున్నాయని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీల సతీష్, బీల దేముడు నాయుడు, రౌడీ బాయ్స్ టీమ్ లీడర్ బీల దేముడు నాయుడు, కోయినాని శ్రీను, బూడి శ్రీను, గవిరెడ్డి అర్జున్ తో పాటు గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

బోనంగి గ్రామంలో

జడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

గంట్యాడ, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మండలంలోని బోనంగి గ్రామంలో రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు సూచనలతో జడ్పీ హైస్కూల్‌కు రహదారి నిర్మాణం కోసం రూ.10 లక్షల గ్రాంట్ మంజూరు చేయబడింది. ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని ఇచ్చిన ఆదేశాల ప్రకారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రహదారి పనులు మండల ఇంజనీరింగ్ అధికారి కృష్ణమూర్తి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అధికారులు పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణం ద్వారా బోనంగి గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, అలాగే చుట్టుపక్కల వ్యవసాయదారులకు మంచి సౌలభ్యం కలగనున్నదని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మరియు కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదానికి గురియైన కాఫీ తోటలను పరిశీలించి

రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరిన జడ్పీ టీసీ దీసరి గంగరాజు

అనంతగిరి, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మండలం అనంతగిరి పంచాయితీ లక్ష్మిపురం గ్రామంలో ఇద్దరు కాఫీ రైతుల 7ఎకరాల కాఫీ తోట అగ్ని ప్రమాదానికి బూడిద అయిన తోటలను సందర్శించిన జడ్పీటీసీ దీసరి గంగరాజు ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పిటిసి సభ్యులు దీసరి. గంగరాజు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ లక్ష్మీపురం గ్రామంలో నివాసముంటున్న సోమెల సుక్రయ్య సోమెల రాము 7 ఎకరాల కాఫీ తోట వేసవికాలం సమీపించడంతో కొండల్లో వెలిగించిన అగ్గి రాజెసుకొని తోటల్లో చేరి ఖాళీ బూడిదైనది ప్రతి సంవత్సరం లక్ష 50 వేల రూపాయలు ఒక ఎకరాకు అమ్మేవారు మిరియాలు పంట కూడా పూర్తిగా కాలిపోయింది లక్షల్లో నష్ట పోయిన బాధిత కుటుంబములకు ప్రభుత్వం ఆదుకోవాలని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అగ్నిలో ఆహుతి అయి కాళీ బూడిదైన కాపీ తోటలను పరామర్శించి పరిశీలించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి జిల్లా ఉన్నతాధికారుల కలెక్టర్ గారు పిఓ గారు కాపీ బోర్డు అధిక ారులతో మాట్లాడి నష్టపరిహారం మంజూరు చేయాలని మాట్లాడుతానని రైతులను భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సోమల నాగులు అనంతగిరి మాజీ వైస్ సర్పంచ్ జమ్మి గుండు లక్ష్మీపురం వార్డు సభ్యులు జర్నీ గంగరాజు టిడిపి నాయకుడు మోసియా రంజిత్ సోమల భీమన్న పీస కమిటీ అధ్యక్షులు నందుల చిన్న గంగులు కార్యదర్శి జన్ని అప్పారావు గ్రామస్తులు పాల్గొన్నారు,

వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

డిపిఆర్‌వోలను ఆదేశించిన స్పెషల్ కమిషనర్

హైదరాబాద్ : జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డి.పి.ఆర్.ఓ.లను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక ఆదే శించారు. నాంపల్లిలోని తెలగాంణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ పక్రియ విధి విధానాలపై డి.పి.ఆర్.ఓ.లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వ హించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జి.ఓ. నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పి.ఆర్.ఓ.లకు సూచించారు. జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దర ఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవూడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల పక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటా రని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులను ఆస్కారం లేకుండా అక్రిడిటేషన్ పక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వ హించాలని అధికారులను ఆమె కోరారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డి.పి.ఆర్.ఓ.లను ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డి.పి.ఆర్.ఓ.లు, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తిన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డి.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.

సోమవారం జివిఎంసి లో

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

- పునర్వ్యవస్థీకరణ చెందిన 10 జోన్‌లలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహణ
- విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు -జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ , ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి ,గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాల యాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదికకార్యక్రమం" 2026 ఫిబ్రవరి 23 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు, హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 2026 ఫిబ్రవరి 23 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

గమనిక: 1) జీవీఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయం 52 వ వార్డు లో గల ఎన్. ఎ .డి కొత్త రోడ్డు , గౌరీ నగర్ లో పశ్చిమ నియో జకవర్గం కార్యాలయం నందు ఏర్పాటు చేయడమైనది.

2) నార్త్ జోన్ కార్యాలయం 51 వ వార్డులో మాధవధార ఉడా లేఅవుట్, ఆర్. టి. ఎ ఆఫీస్ రోడ్డు, పంప్ హౌస్ వెనుక ఉత్తర నియోజకవర్గం కార్యాలయం లో ఏర్పాటు చేయడమైనది.

3) అగనంపూడి జోన్ కార్యాలయం 85వ వార్డులో పెదమడక, శివాలయం రోడ్డు, వినాయక టెంపుల్ సమీ పములో గల రాజీవ్ గాంధీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేయడమైనది. కావున ప్రజలు ఈ పై జోన్ల ప్రదేశాలను గమనించవలసిందిగా కోరుచూ ,మిగిలిన అన్ని జోన్ల కార్యాలయాలు యధాస్థానంలో ఉన్నవని తెలియపరచడమైనది.

గీతం ఆధ్వర్యంలో మెగా బీచ్ క్లినింగ్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రుషికొండ బీచ్ లో మెగా బీచ్ క్లినింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం విద్యార్థులతో పాటు నగరంలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు, ఎనఎసఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి తీర పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హజరై మాట్లాడుతూ తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తీర ప్రాంతం కొన్ని ప్రదేశాలలో ప్రమాదాలకు నెలవుగా ఉందని యువత జాగ్రత్తగా ఉండాలన్నారు.

మత్తు పదార్థాలకు యువతను బానిసలుగా చెయ్యడానికి దుష్ట శక్తులు ప్రయత్ని స్తున్నాయని అప్ర మత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గీతం అడ్మిషన్ డైరక్టర్ ఎమ్.జగధీష్, ఆర్.సాయి, శ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ ఎస్.వి.జి.రెడ్డి, గీతం ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు. బీచ్ క్లినింగ్ కార్యక్రమంలో ఉత్పహంగా పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

బొద్దాం గ్రామంలో శివ జయంతి ఉత్సవాలు

వేపాడ, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : ఎస్ కోట ప్రజాపితా బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో శివ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఎర్రా రామ సత్యవతి, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, మాజీ ఎంపీపీ దుల్లా మహేష్, మాజీ సర్పంచ్ వళ్ళంశెట్టి ప్రకాశం, బల్లంకి నాగేష్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్. కోట సెంటర్ ఇన్‌చార్జ్ బీకే శైలజ సిస్టర్, ప్రముఖ అతిథులతో కలిసి శివ పరమాత్మ జెండాను ఆవి ష్కరించారు. అనంతరం శైలజ సిస్టర్ శివరాత్రి యొక్క ఆధ్యాత్మిక రహస్యాన్ని వివరించి, శివలింగం చిత్రాన్ని అతిథులకు కానుకగా అందించారు.అతిథులు మాట్లా డుతూ, "ఈ శివ జయంతి ఉత్సవాలు మనసుకు ఆహ్లాదాన్ని కలిగించాయి. ప్రతి గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక సత్సంగాలు జరగాలి. సమాజంలో శాంతిని, సద్వ్యవహారాన్ని పెంపొందించే బ్రహ్మా కుమారీల సేవలు అభినందనీయమైనవి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమారు 30 మంది బ్రహ్మకుమారి-కుమారులు మరియు శాఖకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

"స్వచ్ఛ జలము - స్వచ్ఛ మనసు" నినాదంతో జలాశయాలను శుభ్రపరుచు కార్యక్రమం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : సంత్ నిరంకారి మిషన్ వారి సద్గురు బాబా హరదేవ్ సింగ్ జీ మహారాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం వారి జీవితకాలంలో ఇచ్చిన స్ఫూర్తితో కూర్మన్నాలెం, రావుల చెరు వును శుభ్రపరచు కార్యక్రమం చేపట్టి విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం "స్వచ్ఛ జలము - స్వచ్ఛ మనసు" నినాదంతో దేశవ్యాప్తంగా వేలాది సంఖ్యలో జలాశయాలను శుభ్రపరచుట విధంగా గత కొన్ని సంవత్సరాలుగా మునిసిపల్ అధికారుల అనుమతితో కొనసాగిస్తున్నారు. దీనికి సరియైన వాటర్ బాడీని ఎంచుకొని అక్కడ సుమారు 100 మంది సంత్ నిరంకారి మిషన్ యొక్క సేవాదళం మరియు వాలంటీర్లు పాల్గొన్నారు. ఇందులో ప్రాంతీయ వాలంటీర్స్ క్లబ్ అధికారులు మరియు సేవా దళ్ కీతీయ సంచాలకులు కూడా పాల్గొన్నారు. తదపరి 11 గంటలకు సంత్ నిరంకారి మిషన్ సంయోజకులు పేమ్ మిరిపురి, డి. ఎ. ఆర్. రాజు వరకూ సత్సాంగం కూడా జరిగింది. "కాలుష్యం తప్పైనా - బయటైనా కాని రెండూ హానికరమే" అని కాలుష్య నివారణ ఆవశ్యకమైన జీవితానికి తప్పనిసరి అని సద్గురు మార్గదర్శకత్వంలో జీవించాలని సద్గురు మాతా సుధీక్ష జీ మహారాజ్ బోధించారు.

విశాఖనగరంలో అద్భుతంగా "హ్యాపీ సండే" కార్యక్రమాలు...

- మునిసిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాలు, మార్గదర్శకాలతో "హ్యాపీ సండే" కార్యక్రమాలు నిర్వహించిన జీవీఎంసీ
- హ్యాపీ సండే కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంఘాలు, ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు, వృద్ధులు
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : రాష్ట్ర మునిసి పల్ పరిపాలన ڈ పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాలు, మార్గదర్శకాలతో విశాఖ నగరంలో అన్ని జోన్ల పరిధిలో "హ్యాపీ సండే" కార్యక్రమాలు ఆదివారం జీవీఎంసీ అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో అద్భుతంగా నిర్వహించడమైనదని , హ్యాపీ సండే కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ఉత్సాహంగా ప్రజలు ,నివాసిత సంక్షేమ సంఘాలు, విద్యార్థిని విద్యార్థులు ,సీనియర్ సిటిజనులు, ప్రజాప్రతినిధులు పాల్గొని హ్యాపీ సండే కార్యక్రమాన్ని జయప్రదం చేశారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పౌరుల శ్రేయస్సు, పొరుగు బంధాలను బలోపేతం చేయడం, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించడం మరియు ప్రజా స్థలాల సానుకూల వినియోగాన్ని పెంపొందించుట దృష్ట్యా ప్రభుత్వం "హ్యాపీ సండే" అనే స్వచ్ఛంద, సమాజ ఆధ్వర్యంలో నడిచే పట్టణ భాగస్వామ్య ఉద్యమాన్ని రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో అమలు చేయుటకు ప్రతినెల రెండు ,నాలుగు ఆదివారాల్లో ప్రజలు, నివాసిత సంక్షేమ సంఘాలు ,విద్యార్థిని విద్యార్థులు, సామాజిక సంఘాలు, సీని యర్ సిటిజన్‌లు, మహిళలను భాగస్వామ్యం చేస్తూ యోగ, ధ్యానం, వ్యాయామాలు,సామూహిక నడక, జాగింగ్,సైక్లింగ్ ,ఫిట్నెస్ ,సృజనాత్మక క్లాసులు ,వినోదాత్మక క్రీడలు ,ఆటలు, పాటలు, సంగీతం, నృత్యాలు, కుటుంబ బంధాలు పెంపొం దించే కార్యక్రమాలు నిర్వ హించాలని రాష్ట్ర ప్రభ ుత్వం ఉత్తర్వులను, మార్గదర్శకాలను విడుదల చేసింది అన్నారు. హ్యాపీ సండే కార్యక్రమాలను జీవీఎంసీ భీమిలి జోన్లో తోటవీధిలో వాలీబాల్, మధురవాడలో యోగ, ఈస్ట్ జోన్లో కరాటే, యోగ, స్వచ్ఛ ప్రతిజ్ఞ, వెస్ట్ జోన్ ఏపీ ఎస్ సి బి కాలనీలో యోగా , సౌత్ జోన్ లో యోగా, పెందుర్తి లో కరాటే, యోగ ,సీనియర్ సిటిజనులతో సమావేశం, గాజువాకలో కరాటే, యోగ, అగనంపూడి లో సాంస్కృతిక కార్యక్రమాలు ,నృత్యాలు అనకాపల్లిలో స్కేటింగ్ , యోగ కార్యక్రమాలు, ఆటలు ,పాటలు, తదితర వినోద కార్యక్రమాలను మహిళలు ,విద్యార్థిని విద్యార్థులు, వృద్ధులు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వయం సహాయక సంఘ సభ్యులు, ఆర్పీలు, సీనియర్ సిటిజెన్లు, కార్పొరేటర్ల భాగస్వామ్యంతో జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో జీవీఎంసీ అధికారులు ఉద్యోగులు భాగస్వామ్యంతో హ్యాపీ సండే కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. ఈ హ్యాపీ సండే కార్యక్రమాలు అన్ని జోన్లు పరిధిలో గల పార్కులు, కమ్యూనిటీ హాల్లో, బీచ్లో , నిర్వహించడం ద్వారా ఆయా స్థలాల్లో పరిశుభ్రత కాపాడుతూ పరిసరాలను పరిరక్షించుకునేందుకు ఉపయోగపడుతుందని అలాగే పౌరుల మధ్య పరస్పర బంధం ఏర్పడడం, కుటుంబ బంధాలు పెంపొందడం , విద్యార్థిని విద్యార్థులు లో క్రీడలు ఆటలు పాటలు పట్ల ప్రత్యేక దృష్టి సారించడం, ప్రజలు పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధను కనపరచడం వంటి వాటికి హ్యాపీ సండే కార్యక్రమాలు చాలా ఉపయోగపడతాయని కమిషనర్ తెలిపారు.

శ్రీ శ్రీ శ్రీ ఎరుకమాంబ అమ్మవారి దేవస్థానం నందు

మహా శివరాత్రి మారువారం మహోత్సవం సందర్భంగా మహా అన్నదానం కార్యక్రమం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : శ్రీ శ్రీ శ్రీ ఎరుకమాంబ అమ్మవారి దేవ స్థానం నందు మహా శివరాత్రి మారువారం మహోత్సవం సంద ర్భంగా మహా అన్నదానం కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సురేష్ బాబా పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజక వర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీని వాస్‌తో పాటు 27వ వార్డ్ కార్పొరేటర్ గొలగాని వీరరావు బుజ్జి, 42వ వార్డ్ కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ పాల్గొని మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అంతకు ముందు దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డ్ టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, 27వ వార్డ్ జనసేన అధ్యక్షుడు గుండు సురేష్ బాబు, 42వ వార్డ్ బీజేపీ నాయకుడు కన్నం గురుగోవింద్, 27వ వార్డ్ టీడీపీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శివప్రసాద్, మజ్జి వెంకట సత్యనారాయణ, గొరుసు గురునాథ్ రెడ్డి, గంగరాజు, సుజాత, జనసేన నాయకులు రాజేష్, గణేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో వెయ్యి స్టోర్లతో బలోపేతమైన అపోలో ఫార్మసీ

విశాఖపట్నంలో వెయ్యో స్టోర్ ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (నేటి మనదేశమ్) : భారతదేశంలో అతి పెద్ద, అత్యంత విశ్వసనీయమైన ఫార్మసీ నెట్‌వర్క్ అయిన అపోలో ఫార్మసీ.. ఆంధ్రప్రదేశ్‌లో తన వెయ్యో స్టోర్‌ను ప్రారంభించినట్లు సగర్వంగా ప్రకటించింది. విశాఖపట్నంలోని ఈ స్టోర్‌ను నగర పోలీసు కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అపోలో ఫార్మసీ సీఈఓ పి.జయకుమార్, సీఓఓ బాలమురుగన్ కూడా పాల్గొన్నారు. అపోలో ఫార్మసీ దుకాణాలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని 15 జిల్లాల్లో ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి 7 వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు 50 వేలకు పైగా నాణ్యమైన మందులు, ఇతర వెల్‌నెస్ ఉత్పత్తులను ఇది అందిస్తోంది. వీటిలో చాలావరకు స్టోర్లు రోజుకు 24 గంటలూ పనిచేస్తాయి. అన్ని జిల్లాలకూ మందులు చాలా వేగవంతంగా అందిస్తూ, అత్యవసరమైన వైద్య సేవలను కూడా ప్రతిరోజూ విస్తరిస్తోంది. ఈ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, "నాణ్యమైన మందులు, ఇతర వెల్‌నెస్ ఉత్పత్తులు అందుబాటులో ఉండడం అనేది ప్రజారోగ్య రంగంలో చాలా కీలకం. పౌరులకు సమర్థంగా ఈ తరహా వైద్య సేవలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఈ స్థాయిలో కల్పిస్తున్నందుకు అపోలో ఫార్మసీని నేను అభినందిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వారి సేవలు మరింతగా అందించడం కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను" అన్నారు. సీఈఓ జయకుమార్ మాట్లాడుతూ, "భారతదేశంలోనే అత్యంత విశ్వసనీయమై, అందరికీ అందుబాటులో ఉండే ఫార్మసీ నెట్‌వర్క్ రూపొందించే ఈ పయనంలో ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి స్టోర్లకు చేరుకోవడం చాలా కీలకమైన ముందడుగు. రాష్ట్ర వ్యాప్తంగా మా ఉనికిని మరింత బలోపేతం చేసుకుంటున్నాం. తద్వారా ప్రజల నివాస ప్రాంతాల చెంతకే నాణ్యమైన మందులను తీసుకెళ్తున్నాం.

రాబోయే రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో మరో 150కి పైగా స్టోర్లను ప్రారంభించాలన్న ప్రణాళికలు ఉన్నాయి. తద్వారా మరింతమందికి మేం చేరువగా వెళ్తాం" అని చెప్పారు. తన సొంత ప్లాట్‌ఫాం అపోలో 24/7 ద్వారా ప్రజలకు కేవలం మందులు అందించడం మాత్రమే కాకుండా.. అపోలో వైద్యులతో టెలికన్సల్టేషన్లు, డయాగ్నస్టిక్ సేవలు, కస్టమైజ్డ్ బీమా సదుపాయాలు కూడా వారి ఇంటి వద్దనే అపోలో అందిస్తోంది.

Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com